



# విజయభాను

విజయవాడ, ఆదివారం 20-08-2017 | VIJAYABHANU DAILY VIJAYAWADA EDITION | సంపుటి : 10 సంచిక : 78 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## బాల్య వివాహ వ్యవస్థ
## నిర్మూలనే లక్ష్యం



అనంతపురం: రాష్ట్రంలో ఎక్కువ బాల్య వివాహాలు జరిగే జిల్లాల్లో మన జిల్లా రెండో స్థానంలో ఉంది. పూర్తి స్థాయిలో బాల్య వివాహాలను నిర్మూలించడమే లక్ష్యంగా పనిచేద్దాం. జిల్లా స్థాయిలోనే కాదు... మండల స్థాయిల్లోనూ నిర్దేశిత శాఖల సమన్వయంతో అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ వీర పాండియన్, ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి కమలాకర్‌రెడ్డి పేర్కొన్నారు. డ్వామా సభా మందిరంలో బాల్య వివాహాల నిరోధంపై జిల్లా స్థాయి సంప్రదింపుల సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ, బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నట్లు యంగ్ లైవ్స్ సంస్థ సర్వేలో తేలింది. కృష్ణా తర్వాత మనదే రెండో స్థానంలో ఉంది. దీన్ని తీవ్రంగా పరిగణించాలి. బాల్య వివాహాలతో జరిగే అనర్థాలు, ఇతర నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఐసీడీఎస్, పోలీసు, రెవెన్యూ, విద్యాశాఖలు సమన్వయంతో పనిచేయాలి. క్షేత్ర స్థాయిలోనూ ఈ శాఖల సిబ్బంది కలిసిగా పనిచేస్తేనే ఫలితం సాధ్యం. త్వరలోనే జిల్లా స్థాయిలో ఒక అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని ఐసీడీఎస్ శాఖకు సూచించారు. మండల, గ్రామ స్థాయిల్లోనూ నిర్వహించాలి. ఎక్కడై%న బాల్య వివాహాలు జరిగితే తక్షణమే 1098, 100 నెంబర్లకు ఫోన్ చేసి చెప్పాలన్నారు. ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ, వెనుకుబాటుతనం, పేదరికం, ఆర్థిక సమస్యలు, అవగాహన లేమితో బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. వీటిపై విస్తృతంగా ప్రచారం చేద్దామన్నారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి కమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ, కళ్యాణదుర్గం, రాయదర్గం ప్రాంతాల్లో బాల్య వివాహాలు ఎక్కువ సాగుతున్నాయి. ఈ ప్రాంతాలపై మరింత నిఘా ఉంచాలన్నారు. బాల్య వివాహాల చట్టం ప్రకారం రెండేళ్లు జైలు, రూ.లక్ష జరిమానా ఉంటుందన్నారు. తొలుత ఆర్థిక సామాజిక అధ్యయన సంస్థ ప్రతినిధి డాక్టర్ పృథ్వీకర్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. తరువాయి 2లో

## విద్యతోనే విజయాలు

- తరగతుల్లో బోధనా పద్ధతులు మారాలి
- లింగ వివక్ష యూనివర్సల్ సమస్య
- స్మార్ట్ సిటీలో మహిళా హేకథాన్ కార్యక్రమంలో
- కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి సుజనా చౌదరి




విశాఖపట్నం: విజయాలను సాధించడానికి విద్య ఒక్కటే మార్గమని, ఆ విద్య కూడా క్రమశిక్షణతో, ఇంకిత జ్ఞానంతో అభ్యసించాలని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి సుజనా చౌదరి తెలిపారు. అయితే ఆ విద్య బోధనా పద్ధతులు మారాలని ఆయన కోరారు. శనివారం గ్రీన్ పార్క్ హెటల్ నందు స్మార్ట్ సిటీలో మహిళా హేకథాన్ అనే కార్యక్రమాన్ని గర్ల్స్ ఇన్ టెక్ ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వున్నత విద్యా మండలి, యువజన సర్వీస శాఖ, యుఎస్ కాన్సులేట్ జనరల్, ఐబిఎం, వేవ్ ల్యాబ్స్ వారి ఆధ్వర్యంలో షి బిల్డ్స్ టెక్ స్మార్ట్సిటీ హేకథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర మంత్రి సుజనా చౌదరి మాట్లాడుతూ కొన్ని కార్పొరేట్ కళాశాలల్లో గదుల్లో బట్టీ పెట్టే విధానాన్ని అమలు చేస్తున్నారని, ర్యాంకులే ప్రాతిపదికగా సాగే ఈ విద్యా విధానం మారాలని అన్నారు. ఈ విధానంలో బాలికలు క్లాస్ రూంలలో టాపర్లుగా నిలుస్తున్నారని, అయితే నాలెడ్జ్, ప్రాక్టికల్స్, ఇంటర్వ్యూలలో వెనకబడిపోతున్నారని అన్నారు. గత ఏడాది ఐఐటిలో బాలికలు కేవలం 8 శాతం, ఎన్ఐటిలో 13 శాతం మాత్రమే చేరారని అన్నారు. ముఖ్యంగా బాలికల తల్లిదండ్రులు తరువాయి 2లో



## నంద్యాల ఎన్నికల ప్రచార యుద్ధంలో నరాలు తెగే ఉత్కంఠ

### జగన్ మాటలకు చంద్రబాబు సెటైర్లు

నంద్యాల: నంద్యాల ప్రచారంలో సీఎం చంద్రబాబు నవ్వుతూ ప్రతిపక్షనేత జగన్ నరాలు తెంచారు. అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటలు యుద్ధం సహజంగా జరుగుతూ ఉంటుంది. అయితే ఈ విమర్శలు ఒక్కోసారి శృతి మించి పోతుంటాయి. అసెంబ్లీలో అయితే కుర్చీలు విరుసుకునేంత పని చేస్తారు. కొన్ని సందర్భాల్లో గల్లాలు పట్టుకునేందుకు కూడా వెనుకాడని రోజులున్నాయి. అయితే నంద్యాల ఎన్నికల ప్రచారంలో జగన్ తరువాయి 2లో

## నిజం చెప్పని వ్యక్తి బాబు

### మీ జగన్ అబద్ధం ఆడడు



నంద్యాల : ఎవరినో ఎమ్మెల్యే చేయడానికి మనం ఓటు వేయడం లేదు. మూడేళ్లుగా చంద్రబాబు చేసిన మోసాలకు వ్యతిరేకంగా ఓటు వేస్తున్నాం. చంద్రబాబు చేసిన దుర్మార్గం, అన్యాయానికి తరువాయి 2లో

## యూపీలో ఘోర రైలు ప్రమాదం!

- 10 బోగీలు పట్టాలు తప్పాయి
- ఐదుగురు మృతి
- 30 మందికి పైగా తీవ్ర గాయాలు
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- దిగ్భ్రాంతికి గురైన మంత్రులు



లఖ్‌నవూ: ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లోని ఖతౌలి వద్ద ఘోర రైలు ప్రమాదం జరిగింది. పూరీ- హరిద్వార్-కలింగా మధ్య నడిచే ఉత్కల్ ఎక్స్‌ప్రెస్ రైలుకు చెందిన 10 బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ఘటనలో ఐదుగురు మృతిచెందగా.. 30 మందికి పైగా గాయపడ్డారు. వారికి స్థానిక ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

ప్రమాద స్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పూరీ నుంచి హరిద్వార్ వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

## సాంకేతికతతో సులువుగా విధులు


అనంత : సాంకేతికతతోనే పోలీసు విధులు సులభతరం అవుతాయని ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. ఎలక్ట్రానిక్ క్రైం రికార్డు బ్యూరో అప్లికేషన్ పని తీరుపై జిల్లా పోలీసు కార్యాలయంలో సమావేశ మందిరంలో అవగాహన కల్పించారు. ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ, క్రైం రికార్డు బ్యూరో అప్లికేషన్లు పోలీసు విధుల్లో ఎంతో ఉపయోగపడతా యన్నారు. ఠాణా పరిధిలో చోటు చేసుకున్న హత్యలు, హత్యాయత్నాలు, అపహరణలు, అత్యాచారాలు ఇలా పెద్ద ఘటనల నుంచి చిన్న కేసుల దాకా అందులో పొందుపరచాలన్నారు. బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరణ మొదలు కేసుల నమోదు, నిందితుల అరెస్టు, ఛార్జిషీటు దాఖలు వరకూ రోజూ వివరాలు అందులో నమోదు చేయాలన్నారు. దీంతో జిల్లాలోని ప్రతి పోలీసు స్టేషన్‌లోని సమాచారాన్ని అధికారులు సులువుగా తెలుసుకోవడానికి వీలవుతుందన్నారు. రెండు, మూడు రోజులు పట్టే ఎంసీఆర్ జాబితా తయారీ కూడా నిమిషాల్లోనే రూపొందించవచ్చన్నారు. పోలీసు స్టేషన్‌లోని చోటు చేసుకున్న నేరాలే కాకుండా ట్రాఫిక్, పోలీసు కంట్రోలు విభాగం, ఈ-చలానా తదితర విభాగాలు పనితీరును అధికారులు రోజూ సమీక్షించుకోవడానికి వీలవుతుందన్నారు. అనంతరం భవిష్య ఇన్నోవేషన్ సంస్థ ఎండీ రాకేష్ అప్లికేషన్‌లో నమోదు ఎలా చేయాలో వివరించారు. డీఎస్పీలు మల్లికార్జున, వెంకటరమణ, శ్రీధర్‌రావు, నరసింగప్ప తదితరులు పాల్గొన్నారు.

## 21 నుంచి రైల్వే పనులు ఆపేస్తాం



గుంతకల్లు : కేంద్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించనందుకు నిరసనగా సోమవారం నుంచి గుంతకల్లు రైల్వే డివిజన్‌లో ఇంజినీరింగ్‌కు సంబంధించిన పనులను ఆపివేస్తున్నామని అఖిల భారత రైల్వే గుత్తేదారుల సంఘం కార్యవర్గ సభ్యుడు తరువాయి 2లో

టేకిట్-ఈజీ



అలా గుర్తు చూపిస్తూ ప్రచారం చెయ్యడానికి కుదరదు ... మన సింబల్ రైలింజన్ మరి !!

## డ్రెయినేజి పనుల తీరుపై కలెక్టరు అసంతృప్తి



విజయవాడ : విజయవాడ నగరంలో స్టాం వాటర్ డ్రెయినేజీ పనులు ఇప్పటి వరకూ కేవలం 8.5 కిలోమీటర్లు మాత్రమే జరగడంపై కలెక్టరు బి.లక్ష్మీకాంతం అసంతృప్తి వ్యక్తం చేశారు. రోజుకు కిలోమీటరు చొప్పున పనులు జరగాలని నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టి ప్రతినిధులను ఆదేశించారు. నగరంలోని తమ విడిది కార్యాలయంలో నగర పాలక సంస్థ, ప్రజారోగ్య శాఖ, నిర్మాణ సంస్థ (ఎల్ అండ్ టి) అధికారులు, ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. రూ.461 కోట్ల అంచనాతో చేపట్టిన ఈ పనులు 2018 డిసెంబరు నాటికి పూర్తి కావాల్సి ఉందన్నారు. నగరంలో మేజరు డ్రెయిన్లు 142 కి.మీ., మైనరు డ్రెయిన్లు 301 కి.మీ., తరువాయి 2లో




# సీమ అభివృద్ధికి సంపూర్ణ మద్దతు



నంద్యాల : రాష్ట్ర విభజన బిల్లులో ఏడు జిల్లాలకు కేంద్రం ఇవ్వాల్సిన రూ.30 వేల కోట్ల నిధులు రాబట్టుకునేందుకు, సీమ ప్రాజెక్టులు సకాలంలోని పూర్తి చేసేందుకు రాయలసీమ సాగునీటి సాధన సమితి సాగిస్తున్న ఉద్యమానికి రాజకీయ పార్టీలు కలసి రావాలని సమితి అధ్యక్షుడు దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. సీమకు నీటి కేటాయింపుల్లో సహకారం, సిద్ధేశ్వరం, గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని ఆయన వివరించారు.నంద్యాల, రాయలసీమ ప్రాంత అభివృద్ధికి అవసరమైన మౌలిక అంశాలపై రాజకీయపార్టీల వె%ఖరిని స్పష్టం చేసేందుకు, వారి పార్టీల విధివిధానాల ప్రకటనకు సమితి ఆధ్వర్యంలో శుక్రవారం అఖిలపక్ష సదస్సు జరిగింది. సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రులు జేడీ.శీలం, కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డిలు కాంగ్రెస్ పార్టీ తరపున పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయలసీమ సాగునీటి సాధన సమితి రూపొందించిన 20 ప్రతిపాదనలకు సంపూర్ణ మద్దతును వారు ప్రకటించారు. నవతరం పార్టీ అధ్యక్షుడు, ఆ పార్టీ అభ్యర్థి రావు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సమితి చేస్తున్న ఉద్యమానికి అన్ని విధాలా మద్దతుగా ఉంటామన్నారు. రాజ్యాధికార పార్టీ అభ్యర్థి వి.రెడ్డప్ప మాట్లాడుతూ భవిష్యత్తులో సమితి చేపట్టే కార్యక్రమాల్లో పాల్గొంటామన్నారు. రాయలసీమ పరిరక్షణ సమితి తరపున ఆ పార్టీ అధికార ప్రతినిధి అశోక్ మాట్లాడుతూ గుంతకల్లులో రైల్వేజోన్, కడపలో ఉక్కు కర్మాగారం కోసం సమితితో కలిసి పోరాటం చేస్తామన్నారు. ఈ సందర్భంగా బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ తెదేపా, వైకాపా రెండు పార్టీలు ఈసదస్సుకు రాకుండా రాయలసీమ పట్ల తమ వైఖరిని ప్రకటించాయని విమర్శించారు. ఉప ఎన్నిక ప్రక్రియ ప్రారంభమైనప్పట్నుంచి మౌలిక అంశాలపై స్పష్టమైన వైఖరిని ప్రకటించడంలో తెదేపా, వైకాపాలు విఫలమయ్యాయన్నారు. అందువల్ల నంద్యాలలో ఓట్లు అడిగే హక్కు, నైతిక హక్కును ఈరెండుపార్టీలు కోల్పోయాయని సదస్సు తీర్మానించింది. ఈసమావేశంలో సమితి కార్యదర్శి ఎం.మహేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి, రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనరు సోమశేఖర్‌శర్మ, బీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి సిద్ధారెడ్డి, ఓపీడీఆర్ రాష్ట్ర కార్యదర్శి జాన్ బర్నబాస్, సమాచార హక్కుల ప్రచార వేదిక రాష్ట్ర కార్యదర్శి ఎన్‌కే.జయన్న, నంది రైతు సమాఖ్య నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

### ఆర్ఎంఎస్ఏ నిధులపై
## 21 నుంచి ఆడిట్

ఒంగోలు : రాష్ట్రీయ మాధ్యమిక అభియాన్ నిధులు పొందుతున్న ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ నెల 21 నుంచి నిర్వహించనున్న ఆడిట్‌కు హాజరు కావాలని డీఈవో విజయభాస్కర్ తెలిపారు. ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్ ప్రిన్సిపళ్లు 2014 నుంచి 2017 వరకూ నిధుల వినియోగానికి సంబంధించిన దస్త్రాలతో నిర్ణీత తేదీల్లో సర్వశిక్షా అభియాన్ కార్యాలయానికి హాజరుకావాలన్నారు. ఈ నెల 21 ఒంగోలు డివిజన్, 22 మార్కాపురం, 23న పర్చూరు, 24 కందుకూరు డివిజన్‌లోని పాఠశాలలకు ఆడిట్ జరుగుతుందన్నారు. ఉదయం పది గంటలకల్లా హాజరుకావాలని సూచించారు. క్యాష్ బుక్, బ్యాంకు పాస్‌బుక్, ఆడిట్ పుస్తకంతో రావాలని కోరారు.

### రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి

కర్నూలు : ఈనెల 21 నుంచి 23 వరకు అనంతపురం జిల్లా ఆర్డీటీ మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి అండర్-14 ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎం.విజయ్‌కుమార్ ప్రకటించారు.

### టిక్కెట్ లేని
## రైల్వే సిబ్బందిపై చర్యలు

చెన్నై : త్రీ టైర్ ఏసీ బోగీల్లో సరైన టిక్కెట్ లేకుండా ప్రయాణిస్తున్న రైల్వే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. వేలూరు- అరక్కోణం- చెన్నై మార్గంలో నిఘా ఎక్కువగా ఉంటుందన్నారు. 'డివిజనల్ రైల్ యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ' (డీఆర్‌యూసీసీ) సభ్యుల ఆధ్వర్యంలో దక్షిణ రైల్వే డీఆర్‌ఎం కార్యాలయంలో దీనికి సబంధించిన సమావేశం జరిగింది. యూనియన్ నాయకులు ఇలా ఎక్కువగా ప్రయాణి స్తున్నారనే విషయాన్ని 'డీఆర్‌యూసీసీ' సభ్యులు వి.దశరథన్, ఎం.కిశోర్ కుమార్ ఈ అంశాన్ని లేవనెత్తారు. డీఆర్ఎం నవీన్ గులాటి, అదనపు డీఆర్ఎం ఎస్పీ సోర్టె, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజరు బి.రవిచందర్, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ తదితరులు హాజరై ఈ వ్యవహారంపై తప్పకుండా చర్యలు చేపడతామన్నారు. త్రివేండ్రం మెయిల్‌లోని బోగీలు పూర్తిగా పాగతో దర్శనమిస్తున్నాయని డీఆర్ఎంకు వివరించినట్లు దశరథన్ విలేకరులతో చెప్పారు. దీనిపై గులాటి మాట్లాడుతూ ఈ విషయం తన ద ృష్టికి రావడం ఇదే మొదటిసారని తప్పకుండా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఇది చాలా సున్నితమైన అంశమని తప్పకుండా పరిశీలిస్తామని మరో సీనియర్ అధికారి పేర్కొన్నారు. ఓ మోస్తరుగా వర్షం కురిస్తే సెంట్రల్ స్టేషన్‌లోని పైకప్పు నుంచి అక్కడక్కడా వర్షపు నీరు కారుతోందని కిశోర్‌కుమార్ సమావేశంలో అధికారుల ద ృష్టికి తీసుకెళ్లారు. ఎగ్మూరు స్టేషన్‌లో ప్లాట్‌ఫారాలపై పార్సిళ్లతో ప్రయాణికులకు నడవడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు.

మరో సభ్యుడు మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక విధానానికి అనుగుణంగా సబర్బన్ రైళ్లలో ఆటోమేటిక్ తలుపులు ఏర్పాటు చేస్తే బాగుంటుందని, తద్వారా ఫుట్‌బోర్డుపై నిలబడటాన్ని నియంత్రించవచ్చన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్, ట్రేడ్ అసోసి యేషన్స్ అండ్ ఇండస్ట్రీస్, కన్స్యూమర్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, రికగ్నైజెడ్ ప్యాసింజర్ అసోసియేషన్స్‌లకు చెందిన 25 మంది సభ్యులతో పాటు దివ్యాంగుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

### బెట్టింగ్‌లో ఎంతటి వారినైనా
## ఉపేక్షించే ప్రసక్తే లేదు : ఎస్పీ



వెంకటగిరి : బెట్టింగ్ విషయంలో ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని జిల్లా ఎస్పీ రామకృష్ణ స్పష్టం చేశారు. మండలంలోని ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ప్రాంగణంలో శుక్రవారం నూతనంగా ఎంపికైన కానిస్టేబుళ్లకు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ వెంకటగిరి పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సమయంలో మాట్లాడుతూ బెట్టింగ్ వ్యవహారంలో ఇప్పటి వరకు ద్వితీయ శ్రేణి నేతలను అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే స్థాయి వారిపై సమాచారం లేదన్నారు. పూర్తిస్థాయిలో సమాచారం వస్తే ఎంతటి వారినైనా వదలబోమన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు ప్రత్యేక బృందం, స్థానిక పోలీసుల సహకారంతో మొదటి విడతగా 115 మందిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. రెండో విడత మరో 40 మందిని అరెస్టు చేశామన్నారు. ఇంకా విచారణ చేపడుతున్నామన్నారు. సమాచారం మేరకు అరెస్టులు చేస్తున్నామన్నారు. అదేవిధంగా ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక కార్యదళం ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు 12 కేసులు నమోదు చేసి 170 మందిని అరెస్టు చేశామన్నారు. వీరిలో అంతర్జాతీయ స్మగ్లర్లు ఉన్నారన్నారు. కార్యదళంలో ఓఎస్డీ ఆధ్వర్యంలో ముగ్గురు వలయాధికారులు, 8 మంది రక్షక అధికారులు, 30 మంది సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. వీరిలో అన్ని విభాగాలకు చెందిన వారు ఉన్నారన్నారు. ప్రస్తుతం కడప, చిత్తూరు జిల్లాల్లో ఎర్రచందనం దుంగలను నరికి రవాణా చేస్తున్నారన్నారు. వీరిపైనా దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. వెంకటగిరిలో గ్రామీణ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పరిశీ లిస్తామన్నారు. కాల్‌మనీ వ్యవహారంలో కూడా గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న వెంకటగిరి పోలేరమ్మ జాతరకు పక్కా ఏర్పాట్లపై చర్చించామన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటా మన్నారు. వెంకటగిరి సర్కిల్ పరిధిలో పోలీసుల నివాసాలు దెబ్బతిన్న విషయం ఎస్పీ దృష్టి తేగా పరిశీలించి మరమ్మతులకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పోలీస్‌స్టేషన్ కలియ తిరిగి పరిశీలించారు.

సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలి

బెటాలియన్‌లో శిక్షణ పొందుతున్న పోలీసులు ఆధునిక పరిజ్ఞానం వినియోగించుకోవాలని ఎస్పీ అన్నారు. మారుతున్న కాలానికి తగ్గట్లుగా పనితీరును మరింతగా మెరుగు పరుచుకోవాలన్నారు. పోలీసు ఉద్యోగం కష్టంతో కూడినదన్నారు. ప్రజల రక్షణ కోసం విధులు నిర్వహించే ఈ ఉద్యోగంలో నిజాయితీ ఎంతో ముఖ్యమన్నారు. కేవలం పోలీసు ఉద్యోగం వచ్చేసింది, జీతం కంటే గీతం ఎక్కువ అనే భావనను వీడాలన్నారు. పదిమందికి సంతృప్తి కలిగించేలా ఉండాలన్నారు. స్థానిక బెటాలియన్‌లో శిక్షణకు విజయవాడ నుంచి 170 మంది, విశాఖపట్టణం నుంచి 88 మంది పోలీసు ఆర్మ్‌డ్ రిజర్వు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. వీరికి ఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను ప్రారంభించారు.

అనంతరం శిక్షణ సిబ్బంది ఉండే భవనం ఎస్పీ పరిశీలించారు. బెటాలియన్ పరిసరాలు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమాండెంట్ ఎల్.ఎస్ పాత్రుడు, అదనపు కమాండెంట్ రామారావు, సహాయక కమాండెంట్లు ప్రసాద్, ఆరిపుల్లా, శ్రీనివాసులు, వలయాధికారి శ్రీనివాస రావు, రక్షక నిలయాధికారి కొండప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### ప్రమాదాల నివారణకు సహకరించండి

గోపాలపూర్ : ప్రజా చైతన్యంతో ప్రమాదాలు నివారించడం సాధ్యమని, ఈ దిశగా ప్రజా ప్రతినిధులు పోలీసు యంత్రాంగానికి సహకరించాలని బ్రహ్మపుర ఎస్‌డీపీఓ అశోక్‌కుమార్ మహంతి కోరారు. గోపాలపూర్ ఠాణాలో జడ్పీ, సమితి ప్రతినిధులు, 24 పంచాయతీల సర్పంచులతో ట్రాఫిక్ అవగాహన శిబిరం ఏర్పాటైంది. ఈ సందర్భంగా మహంతి మాట్లాడుతూ సెప్టెంబరు 1 నుంచి బైకు చోదకులు తప్పనిసరిగా శిరస్త్రాణాలు (హెల్మెట్లు) ధరించాలన్నారు. వాహన చోదకులు సీటు బెల్టులు పెట్టుకుని, మద్యం తాగకుండా డ్రైవింగ్ చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమాన, కఠిన చర్యలు అనివార్యమని, దీనిపై ప్రజాప్రతినిధులు గ్రామాల్లో ప్రజలకు చైతన్యవంతం చేయాలన్నారు.

# ప్రతిభ చాటుతున్న నాటి బాల కార్మికులు!

### ఉన్నత చదువులు అభ్యసిస్తున్న 180 మంది

చెన్నై : బాల కార్మికులుగా చాకిరి చేసిన పలువురు నేడు విద్యావంతులుగా మారి కళాశాలల్లో సైతం చేరి తమ సత్తా చాటుతున్నారు. కోటి ఆశలతో భవిష్యత్తు వైపు అడుగులు వేస్తున్నారు. ఒకనాడు సామగ్రి, ఇటుకలు వంటివి పట్టిన చేతులే నేడు ఇంజినీరింగ్‌కు సంబంధించిన పరికరాలు పట్టుకుంటున్నాయి. బాల కార్మికులైన పలువురు బడుల్లో చేరి ఈ ఏడాది 30 మంది ఇంజినీరింగ్‌లో, 150 మంది ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో అభ్యసిస్తున్నారు. ఇదంతా బాలకార్మికుల వ్యవస్థ నిర్మూలన శాఖ చొరవతో సాధ్యపడింది. చట్టప్రకారం 14ఏళ్లలోపు పిల్లలను ఎలాంటి పనులకు పెట్టుకోకూడదు. 18ఏళ్లలోపు పిల్లలను ప్రమాదకరమైన పనుల్లో ఉంచకూడదు. కుటుంబ పరిస్థితులు, ఇతరత్రా కారణాలతో పలువురు పిల్లలు చదువుకు స్వస్తిచెప్పి పనులకు వెళ్తున్నారు. బాలకార్మికులను పనిలో పెట్టుకోకూడదని తెలిసినప్పటికీ తక్కువ వేతనాలు ఇవ్వవచ్చనే కారణంతో యజమానులు పట్టించుకోవడం లేదు. అలాంటి బాల కార్మికులకు విముక్తి కల్పించి మళ్లీ పాఠశాలలకు పంపించే చర్యలను జాతీయ బాలకార్మికుల పథకం అధికారులు చేపట్టారు. ఆ మేరకు విముక్తి కల్పించిన వారిని చదివించడానికి తమిళనాడులో 324 జాతీయ బాల కార్మికుల సంక్షేమ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 8,156 మంది చదువుతుండగా... వారిలో 277 మంది 2016-17లో జరిగిన ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షలు రాశారు. 245 మంది ఉత్తీర్ణత కూడా సాధించారు. వీరిలో పలువురు ఇంజినీరింగ్, ఆర్ట్స్ అండ్ సైన్స్ తదితర పలు డిగ్రీ కోర్సుల్లో చేరారు.

కార్ఖానాల నుంచి కళాశాలలకు

ఆవారంకాట్టుకు చెందిన జి.పుష్పలత సేలంలోని ఓ మరమగ్గంలో బాలకార్మికురాలిగా పనిచేస్తుండగా 2010లో ఆమెను అధికారులు విడిపించారు. తర్వాత పాఠశాలలో చేర్పించగా ప్రస్తుతం కుమారాపాళెయంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఇనార్మేషన్ టెక్నాలజీలో చేరింది. అలాగే సేలంలోని మరమగ్గాల్లో పనిచేస్తూ అధికారుల చొరవతో విముక్తి పొందిన వెప్పడైకు చెందిన వినోద్‌రాజ్, ఆవారంకాట్టుకు చెందిన ఎం.సౌందరరాజన్ కూడా ప్రస్తుతం బీఈలో చేరారు. ఇసుక బట్టీలో పనిచేస్తూ విముక్తి పొందిన తీర్థం ప్రాంతానికి చెందిన శివకుమార్ బీఈలో కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో ఇంజినీరింగ్ చేరారు. ఇలా దాదాపు 30 మంది ఇంజినీరింగ్, 150 మంది ఆర్ట్స్ అండ్ సైన్స్, మిగతా విద్యార్థులు డిప్లొమో కోర్సుల్లోనూ చేరారు.

చేయూత అవసరం

ప్రస్తుతం కళాశాలల్లో చేరిన పలువురు విద్యార్థులు ఎలాంటి చింతలేకుండా తమ చదువులు కొనసాగించాలంటే వారికి చేయూత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని తమిళనాడు బాలకార్మికుల వ్యవస్థ నిర్మూలన సంస్థ నిర్వాహకులు చెబుతున్నారు. వారికి ఫీజులు చెల్లింపు వ్యవహారం ఇబ్బందికరంగానే ఉందని తెలిపారు. అలాంటి విద్యార్థులకు తమవంతు చేయూత ఇవ్వడానికి దాతలు ముందుకు రావాలని పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## నిజం చెప్పని వ్యక్తి బాబు

వ్యతిరేకంగా ఓటు వేస్తున్నాం. హామీలు ఇచ్చి ప్రజలను వెన్నుపోటు పొడవటం న్యాయమేనా? నంద్యాలలో వైఎస్ఆర్ సీపీ పోటీ పెట్టకపోయి ఉంటే బాబు నంద్యాల వచ్చేవారా?. ప్రతి పేదవాడికి మూడు సెంట్ల స్థలం ఇస్తామన్నారు. ప్రతి పేదవాడికి ఇల్లు కట్టిస్తామన్నారు. ఇప్పటివరకు ఒక్క ఇళ్లు అయినా కట్టించారా? మూడేళ్ల పాలనలో పేదవాడికి ఒక్క ఎకరా అయినా భూమి ఇచ్చారా?.

ఈ మూడున్నరేళ్లలో చంద్రబాబు ఒక్క హామీనైనా నెరవేర్చారా? వైఎస్ఆర్ హయాంలో రేషన్ షాపులకు వెళితే 9 రకాల సరుకులు ఇచ్చేవారు. చంద్రబాబు సీఎం అయ్యాక బియ్యం తప్ప ఏమీ ఇవ్వడం లేదు. ఎన్నికల ముందు బెల్టు షాపులు లేకుండా చేస్తామన్నారు. మూడేళ్లలో బెల్టు షాపులు తీసేయడం దేవుడెగురు. ప్రతి గ్రామంలో బెల్టు షాపులను అందుబాటులోకి తీసుకొచ్చారు. వీధివీధికి ఓ బెల్టు షాపు, మెసేజ్ పెడితే మందు ఇంటికే. ఇదిగో ఇలా ఉంది చంద్రబాబు పాలన అని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. నంద్యాల ఉప ఎన్నక ప్రచారంలో భాంగా శనివారం 11వ రోజు రోడ్ షోలో ఆయన పెద్దబండ వద్ద జగన్ ప్రసంగించారు.

ఈ మూడేళ్లలో నంద్యాలను కాపాడటానికి ఒక్క రూపాయి అయినా చంద్రబాబు ఇవ్వలేదని ఆయన మండిపడ్డారు. ఏపీకి ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు, పదేళ్లు కావాలన్న చంద్రబాబు... అధికారంలోకి వచ్చాక హోదాను కూడా తీసుకురాలేదన్నారు. జాబు రావాలంటే బాబు రావాలన్నారని, జాబు ఇవ్వకపోతే నెలకు రూ.2వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారని, చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యి 38 నెలలు అయిందని, అంటే ఆయన ప్రతి ఇంటికి రూ.76వేలు బాకీ పడ్డారన్నారు.

వైఎస్ జగన్ ప్రసంగం ఆయన మాటల్లోనే.... రైతులకు రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామన్నారు. బ్యాంకుల్లో పెట్టిన బంగారం బయటకు వచ్చిందా అని అడుగుతున్నా. చంద్రబాబు నిరుద్యోగ భృతి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులను చంద్రబాబు దారుణంగా మోసం చేశారు. 2014 ఆగస్టు 14న సీఎం హోదాలో చంద్రబాబు కర్నూలు వచ్చారు. ఎయిర్‌పోర్టు, ట్రిపుల్ ఐటీ, స్మార్ట్ సిటీ, ఉర్దూ వర్సిటీ, మైనింగ్ స్కూల్ తెస్తామన్నారు. అలవికానీ హామీలను ఎన్నో చెప్పారు. సీఎం హోదాలో ఇచ్చిన హామీని ఏ ఒక్కటీ అమలు చేయలేదు. జీవితంలో నిజం చెప్పని వ్యక్తి చంద్రబాబు. మట్టి నుంచి ఇసుక నుంచి, గుడి భూములు, రాజధాని భూములు, విశాఖ భూములను కూడా వదలలేదు.

చంద్రబాబులా నా దగ్గర డబ్బు, అధికారం, దుర్బుద్ధి, పోలీసులు లేరు. లేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లుగా చూపే చానళ్లు, పేపర్లు నా దగ్గర లేవు. ఆయన మాదిరిలా నా దగ్గర సీఎం పదవి లేదు. నాకున్నదల్లా దివంగత నేత వైఎస్ఆర్ ఇచ్చి పెద్ద కుటుంబమే నా ఆస్తి. వైఎస్ఆర్ సంక్షేమ పథకాల అమలుతో ప్రజల గుండెల్లో బతికుండటమే నా ఆస్తి. మీ జగన్ అబద్ధం ఆడడు. మోసం చేయడు. మాట మీద నిలబడే విశ్వసనీయతే నా ఆస్తి. విలువలతో కూడిన రాజకీయాలే నా ఆస్తి.

జగన్ వాళ్ల నాన్న మాదిరే మాటపై నిలబడతాడన్న విశ్వసనీయతే నా ఆస్తి. నాన్న మాదిరే గొప్ప పరిపాలన అందిస్తాడనే నమ్మకం నాకున్న ఆస్తి. దేవుడి దయ, మీ ఆశీస్సులు నాకు కావాలి. రాజకీయాల్లో జవాబుదారితనం రావాలి. రాబోయే రోజుల్లో చంద్రబాబు అవినీతి సొమ్ముతో మీ దగ్గరకు వస్తాడు. ఆ అవినీతి సొమ్ములోంచి రూ.5వేలు మీ చేతిలో పెట్టి ఒట్టు వేయించుకుని మరీ డబ్బులు ఇచ్చే కార్యక్రమం చేస్తాడు. దెయ్యాలతో గొడవ పడాల్సిన పనిలేదు. మనసులో దేవుడిని తలుచుకోండి. ధర్మంవైపే నిలిచి శిల్పా మోహన్ రెడ్డికి ఓటు వేసి గెలిపించండి అని కోరారు.

## నంద్యాల ఎన్నికల ప్రచార యుద్ధంలో నరాలు తెగే ఉత్కంఠ

రాజకీయ ఆరోపణలు దాటి "చంపండి, ఉరివేయండి.. బట్టలు లూడదీయండి" అని పరుష పదజాలంతో చంద్రబాబుపై విరుచుకుపడ్డారు. జగన్ తీరును జాతీయ మీడియాలు సైతం ఎండగట్టాయి. అయితే ఇదే నంద్యాల ఎన్నికల ప్రచారం చంద్రబాబు తన ప్రచారంలో జగన్‌పై నవ్వుతూ సెటైర్లు విసిరారు.

జగన్ వచ్చి ఏం చెబుతున్నారు.. ప్రజలకు మంచి చేస్తున్న తనను నడిరోడ్డుపై కాల్చేయాలంటున్నాడు.. ఉరివేయాలంటున్నాడు.. బట్టలూడదీస్తా అంటున్నాడు.. తమ్ముళ్లూ.. మీరే ఆలోచించండి అంటూ సీఎం సభికులను ఆలోచింపజేశారు. జగన్ అసెంబ్లీకి తప్ప ఒక్క రోజైనా అమరావతికి రాలేదని, నంద్యాలలో జగన్ 11 రోజులుగా వీధి వీధి తిరుగుతున్నారని ఆరోపించారు. వైఎస్ కుటుంబం పులివెందులలో శాంతి లేకుండా చేసిందని, నంద్యాలను నెం.1 చేయడమే లక్ష్యమని చంద్రబాబు భరోసా ఇచ్చారు. నంద్యాలకు శిల్పా మోహన్ రెడ్డి ఏమీ చేయలేదని, కౌన్సిల్ ఛైర్మన్ పదవి ముస్లింలకు కేటాయిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు.

## విద్యతోనే విజయాలు

బాలికలపై పెట్టుబడి పెట్టేందుకు గానీ, చదువు నిమిత్తం బైటకు పంపేందుకు గానీ ముందుకు రావడం లేదని, తల్లిదండ్రులు ధోరణి మారాలని అన్నారు. యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తోందని అన్నారు. అవకాశాలు అనేకం వున్నాయని, వాటిని అందుకోవడానికి యువత ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలంటే కొంత రిస్కు తీసుకోవాలని, తాను కూడా రిస్క్‌తోనే మొదలై నేడు ఉత్తమ పారిశ్రామికవేత్తగా నిలిచానని ఉదాహరించారు. ప్రస్తుత పరిస్థితులు పారిశ్రామికవేత్తలకు చాలా ప్రోత్సాహకరంగా వున్నాయని, అయితే ఒక విజన్‌తో కార్యాచరణను రూపొందించుకోవాలని విజన్ లేనిదే విజయం వుండదని దిశా నిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వం మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి స్టేండప్ ఇండియా అనే పథకం ద్వారా మహిళలకు తప్పని సరిగా జాతీయ బ్యాంకులు రుణాలిచ్చేలా నిబంధనలు రూపొందించడమైందన్నారు. మహిళలకు రాజకీయాల్లో రిజర్వేషన్ అవసరం లేకుండానే ఎదగగలరని, అయితే వారికి సరైన విద్య, ప్రోత్సాహం కెపాసిటీ బిల్డింగ్ వుండాలని అభిప్రాయపడ్డారు. లింగ వివక్షత అనేది ప్రపంచమంతటా వుందని, అభివృద్ధి చెందిన దేశాలకంటే భారత్‌లో అది కొంచెం తక్కువగానే ఉందని అన్నారు. లింగ వివక్షను అధిగమించాలంటే మహిళలు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకుని, తమ కాళ్లపై తాము నిలవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు కంభంపాటి హరిబాబు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్, గర్ల్స్ ఇంటెక్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ దివ్య, యుఎస్ కన్సొలేట్ గాబ్రియల్, ధర్మపథ సిఇఓ రాజశేఖర్ కందుకూరి, ఎఐసిటిఇ డైరెక్టర్ మన్ ప్రీత్ సింగ్ మన్నా, సౌత్ ఏసియా యుఎస్ ఎంబసీ మెహనాజ్ అన్సారీ, తదితరులు వారి సందేశాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్శిటీ విసి జి. నాగేశ్వరరావు, విశాఖపట్నం, విజయవాడ ఇతర ప్రాంతాల నుండి విచ్చేసిన ఐటి విద్యార్థినులు హాజరైనారు.

## బాల్య వివాహ వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం

సమావేశంలో జేసీ-2 ఖాజామొహిద్దీన్, ఐసీడీఎస్ ఇన్‌ఛార్జి పీడీ శ్యామల, డీఆర్‌డీఏ పీడీ వెంకటేశ్వర్లు, డీపీవో సుధాకర్‌రెడ్డి, ఎస్ఎస్ఏ పీవో సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు. తుదిగా ప్రచార గోడపత్రాలను ఆవిష్కరించారు.

## డ్రెయినేజి పనుల తీరుపై కలెక్టరు అసంతృప్తి

వెరసి మొత్తం 443 కి.మీ. మేర పనులు జరగాల్సి ఉందన్నారు. ఈ క్రమంలో సదరు ప్రాజెక్టును నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో వీఎంసీ సీఈ అంకయ్య, ప్రజారోగ్య శాఖ ఎస్ఈలు ఆదిశేషు, శ్రీనివాస్, ఈఈ ప్రసాదరావు, ఎల్ అండ్ టి సంస్థ మేనేజరు శరవణ్ తదితరులు పాల్గొన్నారు.

## 21 నుంచి రైల్వే పనులు ఆపేస్తాం

సురేష్ పేర్కొన్నారు. డివిజన్‌కు చెందిన గుత్తేదారులు ఎ.డి.ఆర్.ఎం.కు వినతిపత్రాన్ని సమర్పించారు. జి.ఎస్.టి.ని ప్రవేశపెట్టక ముందు నిర్వహించిన రైల్వే టెండర్లకు జి.ఎస్.టి.ని మినహాయించాలని కోరినా ప్రభుత్వం పట్టించుకోనందుకు తాము పనులు నిలిపివేయాలని తీర్మానించుకొన్నట్లు తెలిపారు. ఎనిమిది శాతం పన్నును దృష్టిలో ఉంచుకొని టెండర్లు వేశామని, అయితే ఇప్పుడు 18 శాతం చెల్లించాలని ఆదేశించడం అన్యాయమని పేర్కొన్నారు. పాతపనులకు తక్కువ మొత్తాలకు టెండర్లు వేశాం. ఇప్పుడు ఎక్కువ పన్నును చెల్లించి పనులు చేస్తే తీవ్రంగా నష్టపోతామని వాపోయారు. జులై 1వ తేదీ నుంచి జి.ఎస్.టి. అమలు అవుతున్నందున ఈ సమయం నుంచి నిర్వహించే టెండర్లకు దీన్ని అమలు చేస్తే తమకు అభ్యంతరం లేదని అధికారులకు చెప్పారు. అనంతరం ఎ.డి.ఆర్.ఎం. సుబ్బరాయుడు, ఇతర శాఖల అధికారులు గుత్తేదారులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం జి.ఎస్.టి.ని తగ్గించడానికి కృషిచేస్తోందని, ఆదేశాలు వచ్చేవరకు పనులు ఆపకుండా కొనసాగించాలని అధికారులు సూచించారు. పనులను ఆపివేయాలని దేశవ్యాప్తంగా ఉన్న గుత్తేదారులు తీసుకొన్న నిర్ణయమని వారు సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ డి.ఎఫ్.ఎం. రాజశేఖర్‌బాబు, డి.ఎఫ్.ఎం. అంజయ్య, ఇతర అధికారులు, పలువురు గుత్తేదారులు పాల్గొన్నారు.

# తెదేపాతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి



కర్నూలు : నవ్యాంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే పనిచేసే పార్టీకే పట్టం కట్టాలని రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి శాఖమంత్రి గంటా శ్రీనివాసరావు కోరారు. నంద్యాలలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో వివిధ ప్రైవేటు విద్యాసంస్థల యాజ మాన్యాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వినూత్న సంస్కరణలతో ముందు కెళ్తోందని, అన్ని వర్గాల ఆకాంక్షలకు అను గుణంగా వాటిని తీర్చిదిద్దుతున్నామన్నారు. విద్యారంగంలోనే కాకుండా అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో పయనిస్తోందని, ఇలాంటి సందర్భంలో తెలుగుదేశం పార్టీ గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి ముడిపడి ఉందన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. తెదేపా గెలుపునకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఆకాంక్షించారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ముందున్న విషయాన్ని వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధినే గుర్తుచేయడానికి ఇక్కడికి వచ్చానని, విద్యారంగ సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రైవేటు విద్యాసంస్థల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటున్నామని తెలిపారు. నంద్యాలలో తెదేపాను గెలిపించడం ద్వారా రాష్ట్రాభివృద్ధికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యాసంస్థల రాష్ట్ర నాయకులు కట్టమంచి రామలింగారెడ్డి, పుల్లయ్య పాల్గొన్నారు.

# విజయవాడ ప్రాంతీయ వార్తలు

## సామూహిక మరుగుదొడ్లను తొలగించండి

పగిడ్యాల: మండల పరిధిలోని ఘనపురం, పాలమర్రి గ్రామాల్లో ఉన్న సామూహిక మరుగుదొడ్లను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వర్షాకాలంలో మరుగుదొడ్ల నుంచి వచ్చే దుర్వాసనను భరించలేక పోతున్నామని సమీప కుటుంబాల వారు శనివారం న్యూస్‌టుడేతో వాపోయారు. సామూహిక మరుగుదొడ్లను తొలగించాలని గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినా అధికారులు తొలగించడంలేదని వారు తెలిపారు. ఇప్పటి కైనా అధికారులు స్పందించి వెంటనే సామూహిక మరుగుదొడ్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

## మట్టి వినాయక విగ్రహాలపై అవగాహన సదస్సు

ఎమ్మిగనూరు: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పురపాలకసంఘం కమిషనర్ రఘునాథరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని వైష్ణవి డిగ్రీ కళాశాలలో మట్టి వినాయక విగ్రహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వాడటం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని ఆయన తెలిపారు. ఈ విగ్రహాలను నిమజ్జనం చేసినప్పుడు తాగునీటిలో రసాయనాలు కలిసి ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. మట్టి వినాయక విగ్రహాలు వాడటం వల్ల పర్యావరణాన్ని కాపాడిన వారవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైష్ణవి డిగ్రీ కళాశాలల కరస్పాం డెంట్ జి.లింగప్ప, మున్సిపల్ మేనేజర్ రంగస్వామి, టీపీఎస్ నాగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హిందూ ముస్లింలు ఐక్యంగా మెలగాలి

కర్నూలు : దేశ విభజన సమయంలో పాకిస్థాన్‌లోని ధారాభి గ్రామంలో నివసించిన హిందూ, సిక్కు, ముస్లింల స్నేహం, వారి ప్రేమాభిమానాలపై ఆంగ్లంలో రచించిన పుస్తకాన్ని, తాను ఉర్దూ భాషలోకి అనువదించిన బట్వారా పుస్తకాన్ని ఈనెల 21న ఆవిష్కరించనున్నట్లు ఉర్దూ విశ్వవిద్యాలయం ఉపకులపతి ముజఫర్ అలీ తెలిపారు. శుక్రవారం స్థానిక ఉర్దూ వర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాకిస్థాన్‌లో అల్లర్లు మొదలై హిందూ, సిక్కు మిత్రులపై దాడి జరుగుతున్న సమయంలో ముస్లిం సోదరులు వారికి రక్షణగా నిలిచి స్నేహానికి నిదర్శనంగా నిలిచారని, బాధిత కుటుంబాలను సురక్షితంగా భారతదేశానికి పంపించేందుకు సాహసం చేశారన్నారు. ద్వేషంతో ఏమి సాధించలేమని.. ఆపదలో హిందూ, సిక్కు మిత్రులకు రక్షణగా నిలిచిన ముస్లిం సోదరుల మాదిరిగానే మన దేశంలోనూ ఐక్యంగా సోదరభావంతో మెలగాలన్నది పుస్తక సందేశమన్నారు.

ఈ పుస్తకాన్ని ఎస్.పి.సింగ్ ఒబెరాయ్ తండ్రి జీవిత చరిత్ర ఆధారంగా పంజాబీ, ఆంగ్లం, హిందీ భాషలో ప్రచురించారని, దీనిని ఉర్దూ భాషలోకి అనువాదం చేసినట్లు చెప్పారు. ఆవిష్కరణకు హైదరాబాదులోని కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పి.అప్పారావు, దుబాయి లోని అపెక్స్ కంపెనీ ఛైర్మన్ ఎస్పీ సింగ్ ఒబెరాయ్, పాటియాలలోని పంజాబీ వర్సిటీ ఆచార్యులు సార్బిజిందర్ సింగ్, పరమవీరసింగ్, పర్బలీస్ సింగ్, ఆచార్య ఏసీ నారాయణ ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు.

## రైల్వే పక్షోత్సవాల్లో స్వచ్ఛభారత్



కర్నూలు: రైల్వే పక్షోత్సవాల్లో భాగంగా కర్నూలు రైల్వేస్టేషన్‌లో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దక్షిణ మధ్య రైల్వే మానవ వనరుల విభాగపు అధికారి ఆదిత్యకుమార్ హాజరై, ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి శ్రమదానం చేశారు. అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పక్షోత్సవాల్లో భాగంగా దక్షిణ మధ్య రైల్వే స్లేషన్లలో ప్రతీ రోజు ఒక్కొక్క కార్యక్రమాన్ని చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ సయ్యద్ మక్బుల్ హుస్సేన్, రైల్వే ఆసుపత్రి వైద్యులు డా.సిద్దిఖ్, మొహిద్దీన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గాయ్

నెల్లూరు : జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయని, అందుకు పోలీసు, ట్రాన్స్‌పోర్టు, ఆర్టీసీ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమాలే కారణమని జిల్లా కలెక్టరు రేవు ముత్యాలరాజు అన్నారు. నెల్లూరు నగరంలోని క్యాంపు కార్యాలయంలో జిల్లా రోడ్డుసేఫ్టీ కమిటీ సమావేశం జరిగింది. రోడ్డు ప్రమాదాలు, మరణాలు, క్షతగాత్రులు ఇతర అంశాలపై చర్చించారు. ఈ ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలపై డివిజన్‌ల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్. శివరామప్రసాద్ మాట్లాడుతూ జాతీయరహదారి-16కి సంబంధించి జిల్లాలో తడ నుంచి కావలి వరకు గుర్తించిన ప్రమాదకరమైన జంక్షన్‌ల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. కలెక్టరు స్పందిస్తూ గుర్తించిన ప్రాంతాలల్లో ట్రాఫిక్ ఎక్కువ ఉన్న సమయాలల్లో వీడియో తీయించాలని సూచించారు. జిల్లా ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ మాట్లాడుతూ.. జిల్లాలో జాతీయరహదారిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిం చడం వల్ల చాలా వరకు రోడ్డు ప్రమాదాలు తగ్గాయన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, లైసెన్సులేకుండా వాహనాలు నడుపుతున్నవారిపై కేసులు నమోదు చేయడంతో చాలావరకు ఈ తరహా కేసులు తగ్గాయని ఆయన వివరించారు. ఆటో డ్రైవర్‌లందరికీ ఓ వారం రోజులు సమయం ఇచ్చా మని శనివారం నుంచి నిబంధనల ప్రకారం చర్యలుంటాయని తెలిపారు. నేషనల్ హైవే అథారిటీ మేనేజరు విద్యవాణిని గతంలో నేషనల్ హైవేపై తీసుకున్న నిర్ణయాలను ఎలా అమలు చేశారని ముత్యాలరాజు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ, పీడీ విజయ్‌కుమార్, ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ కంట్రోలర్ సత్యనారాయణ, నేషనల్ హైవే ఇంజినీరు విజయభాస్కర్, వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వర సుందరం, పోలీసు, ఆర్టీఏ అధికారులు పాల్గొన్నారు.

## వాల్మీకుల అభివృద్ధికి తోడ్పాటు

యాళ్లూరు : వాల్మీకుల అభివృద్ధికి తెదేపా ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలు ఇస్తూ ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసిందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కాల్వ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని యాళ్లూరులో వాల్మీకులు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ముఖ్య అతిథులుగా గృహ నిర్మాణ శాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, వాల్మీకి ఫెడరేషన్ అధ్యక్షుడు బీటీ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ.. వాల్మీకుల అభివృద్ధికి చంద్రబాబు నాయుడు ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి రూ.25 కోట్లు కేటాయించారన్నారు. ఎస్టీ జాబితాలో వాల్మీకులను చేర్చాలని ఎంతో కాలంగా డిమాండు చేస్తున్నారని, అయితే ప్రతి కుటుంబం తమ పిల్లలను బాగా చదివించాలన్నారు. తెదేపా అభ్యర్థి యువకుడని, సమస్యల్ని తీరుస్తారని, సైకిలు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు.

### కంప్యూటర్ ట్యాలీలో ఉచిత శిక్షణ

ఒంగోలు : ఐటీడీఏ, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరు ఐటీడీఏ కార్యాలయంలో అకౌంట్స్ అసిస్టెంట్ యూజింగ్ ట్యాలీపై మూడు నెలల పాటు గిరిజన నిరుద్యోగ యువతకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఇన్‌ఛార్జి అధికారిణి ఎం.లక్ష్మీసుధ తెలిపారు. 18 నుంచి 30 ఏళ్లు కలిగి ఇంటర్మీడియెట్ విద్యార్హత కలిగిన వారికి శిక్షణ ఇస్తారన్నారు. ఈ నెల 21వతేదీ నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం టోల్‌ప్లాజా దగ్గర ఎర్రగుంట గ్రామంలోని యువజన కేంద్రంలో ముఖాముఖి ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి శిక్షణ ప్రారంభిస్తారన్నారు. శిక్షణ అనంతరం అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మీ సేవా ద్వారా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్‌కార్డులు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు వెంట తెచ్చుకోవాలని సూచించారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం సౌకర్యం కల్పిస్తారన్నారు. అవకాశాన్ని గిరిజన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని అధికారిణి సూచించారు.

## బీసీలే తెదేపాకు వెన్నెముక




నంద్యాల :తెలుగుదేశం పార్టీకి బీసీలు వెన్నెముక లాంటి వారని రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ పేర్కొన్నారు. శ స్థానిక స్వామి వివేకానంద ఆడిటోరియంలో వడ్డెర సంఘం ఆత్మీయ సమావేశం రాష్ట్ర మాజీ ఆర్‌ఐసీ ఛైర్మన్ ఎ.వి.సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్, అనంతపురం ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, ఎమ్మెల్సీ వావివాల సునీత, వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ దేవెళ్ల మురళి, శాలివాహన కార్పొరేషన్ అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్రలు పాల్గొన్నారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ వడ్డెర్లను గుర్తించి వారికి కార్పొరేషన్ పదవులు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. వడ్డెర్లను బీసీల్లో చాలా వెనుకబడి ఉన్నారని తెలిపారు. వీరిని అన్నీ పార్టీలు ఓట్ల కోసమే వాడుకున్నాయి తెదేపా మాత్రమే గుర్తించి అభివృద్ధికి తోడ్పడిందన్నారు. కార్పొరేషన్‌కు రూ.కోట్లు అందజేశారన్నారు. పదేళ్ల తర్వాత వడ్డెర్ల సతమావేశం విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి భూమా బ్రహ్మానందరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమస్యలేవైనా తమ దృష్టికి తీసుకువస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు తిరుపాలు బాబు, కుంచెపు శ్రీనివాసులు, నరసింహులు, లక్ష్మీకాంతయ్య, వడ్డె శ్రీను, నాన్న, సుబ్బారాయుడు, హరిబాబు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక కేంద్రంగా గుండ్లకమ్మను తీర్చిదిద్దాలి

### జలాశయం సందర్శనలో కలెక్టర్



మల్లవరం : గుండ్లకమ్మ జలాశయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ వినయ్‌చంద్ పేర్కొన్నారు. మద్దిపాడు మండలం మల్లవరంలోని జలాశయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుడి, ఎడమ కాలువలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. డ్యామ్ కట్టపై ఉన్న వ్యర్థాలను తొలగించి... పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఇక్కడి ఉద్యానాలను మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జలాశయం దిగువ ప్రాంతాల్లో అడ్డుకట్టలు వేసి... నీటిని దుర్వినియోగం చేసే వారిపై వెంటనే చర్యలు తీసుకుని, ప్రతి గ్రామానికి నీరందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వచ్చే వరద నీటిని జాగ్రత్తగా నిల్వచేసి... తాగు, ఖరీఫ్ సాగు అవసరాలు తీరేలా చూడాలన్నారు. వచ్చే నెలలో ముఖ్యమంత్రి పర్యటించే అవకాశం ఉన్నందున... అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం... అక్కడి వేంకటేశుని ఆలయంలో పూజాధికాలు చేపట్టారు. రైతులకు నీరందేలా చర్యలు తీసుకోవా లని రైతు సంఘం నాయ కులు వరహాలచౌదరి కలె క్టర్‌ను కోరారు. తమ పొలాల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడు తున్నారని... ఈ కారణంగా చాలా సమస్యలు తలెత్తుతున్నాయని అన్నంగి రైతులు విన్నవిం చారు. కార్యక్రమంలో జేసీ నాగలక్ష్మి, ఆర్డీవో శ్రీనివాసరావు, జలాశయం ఎస్‌ఈ రెడ్డయ్య, తహసీల్దారు కేవెల్ నరసింహారావు, సర్పంచి వేణుబాబు, అధికారులు పాల్గొన్నారు.

## భూసేకరణపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

కొడవలూరు : మండలంలోని బొడ్డువారి పాళెం రెవెన్యూ పరిధిలోని చంద్రశేఖరపురంలో 384 ఎకరాల సీజేఎఫ్ఎస్ భూములను ఏపీఐఐసీకి అప్పగించరాదని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ హైకోర్టు శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరి హారాన్ని అందించాలని కోరుతూ సీజేఎఫ్ఎస్ భూముల లబ్ధిదారులు పలువురు రైతులు ఇటీవల హైకోర్టులో కేసు వేశారు. దీంతో ప్రముఖ సీనియర్ న్యాయవాది రామచంద్రరావు రైతుల పక్షాన హైకోర్టులో వాదనలు వినిపించారు. 40 ఏళ్లుగా రైతుల ఆధీనంలో ఉన్న 384 ఎకరాల సీజేఎఫ్ఎస్ భూములను ఏపీఐఐసీ స్వాధీనం చేసుకొని 132.5 ఎకరాలకు మాత్రమే నామమాత్రంగా పరిహారాన్ని చెల్లిం చారని కోర్టుకు తెలిపారు. ఈ భూముల పక్కనే ఉన్న ఇఫ్కో కిసాన్ సెజ్‌లో కోకోకోలా కంపెనీకు ఎకరా రూ.56 లక్షలకు ఇవ్వడాన్ని చూపిస్తూ రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం రూ.1.42 కోట్లు మంజూరు చేయాలని వాదనలు వినిపించారు. దీంతో హైకోర్టు న్యాయమూర్తి ఏ.రామలింగేశ్వరావు రైతుల వాదనలనపై స్పందిస్తూ చంద్రశేఖరపురం సీజేఎఫ్ భూములను రైతుల ఆధీనంలోనే ఉంచాలని ప్రభుత్వం, జిల్లా కలెక్టరు రేవు ముత్యాలరాజు, నెల్లూరు ఆర్డీవో, కొడవలూరు తహశీల్దారు, ఏపీఐఐసీ ఛై%ర్మన్లను ఆదేశించింది.

విచారణ మరో నాలుగు వారాలకు వాయిదా వేసింది. దగదర్తి మండలంలోని సున్నపుబట్టి, అనంతరం రైతులు కూడా హైకోర్టును ఆశ్రయించనున్నట్లు సమాచారం.

## నైపుణ్యాలు ఉన్నవారినే ఎంపిక చేస్తాం: జేసీ-2

### గురుకుల పాఠశాలల్లో ఒప్పంద అధ్యాపకులకు ఇంటర్వ్యూలు

నెల్లూరు : జిల్లాలోని వివిధ గురుకుల పాఠశాలల్లో ఒప్పంద అధ్యాపకులుగా పని చేసేందుకు అర్హతగల అభ్యర్థులకు కలెక్టరేట్ కార్యాలయంలో తన ఛాంబరులో జేసీ-2 వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రి, సోషల్ తదితర సబ్జెక్టులకు 62 అధ్యాపక పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 500 మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. వారిలో అర్హతలు, నైపుణ్యం, ఇతర ఆధారాలను పరిగణలోకి తీసుకోగా 150 మందిని ఇంటర్వ్యూకు పిలిచారు. వారందరికీ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటలవరకు ఈ ఇంటర్వ్యూలు నిర్వహించారు. జేసీ-2 వెంకటసుబ్బారెడ్డి, నిపుణులైన అధ్యాపకుల సమక్షంలో ప్రతి అభ్యర్థిని స్వయంగా వారి సబ్జెక్టులవారీగా అందులోని పాఠ్యాంశాలపై ప్రశ్నలువేస్తూ, సందేహాలను వ్యక్తం చేస్తూ సమాధానాలు రాబట్టారు. నైపుణ్యాలు మెండుగా ఉన్న అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన వారికి తక్షణమే పోస్టింగ్ ఆర్డర్స్ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాలల అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా ప్రారంభమైన వరుణయాగం



మార్కాపురం : గత మూడేళ్లుగా తీవ్ర వర్షా భావ పరిస్థితులతో అల్లాడిపోతున్న మార్కాపురం ప్రాంత ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని లక్ష్మీచెన్నకేశవస్వామి దేవ స్థానం ఆధ్వర్యంలో వరుణ యాగ కార్యక్రమాన్ని శుక్రవారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు.

కంచి లోని శృంగేరి పీఠాధిపతి భారతీతీర్థ స్వామి శిష్యులు, స్థానిక వేద పండితుల ఆధ్వర్యంలో చెన్న రాయునిపల్లి చెరువులోని చెన్నకేశవుని శిలా విగ్రహం వద్ద యాగశాలను ఏర్పాటు చేశారు. త్రయాహ్నిక దీక్షతో లోక కల్యాణార్థం ధన, ధాన్య సమృద్ధికి వరుణయాగం చేస్తున్నట్లు కంచి స్వాములు తెలిపారు.

తొలిరోజున విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ, వరుణ, కలశస్థాపన, రుష్యశృంగ మహాముని ఆవాహన, మంగళ హారతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం... గణపతి, నవగ్రహ, వరుణ, రుష్యశృంగ మహామంత్ర అను ష్టానములు, విరాటపర్వ పారాయణం, రుద్రాభిషేకం, గణపతి హోమం తదితరాలు నిర్వహించారు.

కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ వక్కలగడ్డ రాధిక మల్లికార్జున్, చెన్నయ్య ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ యక్కలి కాశీ విశ్వనాథం, సభ్యులు, స్థానిక వేదపండితులు జొన్నాభొట్ల రాముశర్మ, నంద్యాల తిరుమలా చార్యులు, శ్రీపతి అప్పనాచార్యులు పాల్గొన్నారు.

## ప్రతీ ముస్లిం హజ్‌యాత్రకు వెళ్లాలి

పగిడ్యాల: ప్రతీ ముస్లిం హజ్ యాత్రకు వెళ్లాలని అమీర్ సాహెబ్ అల్లాబకాష్ అన్నారు. శనివారం మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామానికి చెందిన గార్గ్యాపురం మాబులాల్, ముర్తుజాబీ దంపతులు హజ్‌యాత్రకు బయలుదేరుతున్న సందర్భంగా శనివారం మక్కా మసీదులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ దంపతులకు పూలమాలలు, శాలువాలతో సత్కరించి పురవీధుల గుండా ప్రదర్శన నిర్వహిస్తూ పవిత్రమైన హజ్‌యాత్రకు వారిని సాగనంపారు. ఈ కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ మెంబర్ ఇస్మాయిల్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతానికి గురై యువకుని మృతి

కొలిమిగుండ్ల: విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన ఘటన కొలిమిగుండ్ల మండలంలోని పెట్నికోట గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన బళ్లారి ఆంజనేయులు(30) బండల పాలిష్ ఫ్యాక్టరీలో పని చేయడానికి శనివారం ఉదయం వెళ్లాడు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే నీరు గుంతలోకి వెళ్లేందుకు అడ్డంగా ఉన్న మట్టిని తొలగిస్తున్నాడు. ఈ క్రమంలోనే నీటి గుంతలోకి దిగి ఆ పక్కనే ఉన్న ఇనుప పైప్‌నకు విద్యుత్తు సరఫరా అవుతున్న విషయం తెలియక ఆ పైప్‌ను పట్టుకున్నాడు. దీంతో అతను విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందారు. ఆంజనేయులుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

విజయభాను
సంపాదకీయం

## పరస్పర దాడులింకెన్నాళ్లు!?

స్పెయిన్‌లోని బార్సిలోనా నగరంలో జరిగిన ఉగ్రవాద దాడి దిగ్భ్రాంతికరం. ఇస్లామిక్ స్టేట్‌కు చెందినట్టు భావిస్తున్న ఉగ్రవాదులు జనంలోకి వాహనాన్ని నడిపి పదమూడు మంది ప్రాణాలను బలిగొన్నాడు. ఈ దారుణ ఘటనలో కనీసం వందమంది గాయపడ్డారు. అమెరికా కూటమిలో భాగంగా ఉండి ఇరాక్, అఫ్ఘానిస్థాన్ దేశాల మీద దాడులు సాగిస్తున్నందుకు తాము ప్రతీకార చర్యకు పాల్పడినట్టు ఉగ్రవాదులు ప్రకటించారు. ఆయా దేశాలు ఒక కూటమిగా ఏర్పడి ఇతర దేశాలపై దాడికి పాల్పడటంలోని మంచి చెడుల గురించి మాట్లాడుకోవడం వేరు. ఇరు పక్షాలూ యుద్ధ క్షేత్రంలో పరస్పర దాడులకు పాల్పడుతూనే ఉన్నాయి. కానీ ఈ దారుణాలతో ఎటువంటి సంబంధం లేని అమాయక ప్రజల మీదికి వాహనాన్ని నడిపి బలిగొనడం సమర్థనీయం కాదు. ఇస్లామిక్ స్టేట్‌గా చెప్పుకుంటున్న వారు కూడా సొంత సైన్యం తో అమెరికా కూటమితో పోరాడుతున్నారు. అటువంటప్పుడు యుద్ధాన్ని అక్కడికే పరిమితం చేయకుండా అమాయక ప్రజలపై దాడులు చేయడం అంతర్జాతీయ సూత్రాలకు, యుద్ధ నియమాలకు విరుద్ధం. ఉగ్రవాదులు అమానుష దాడులకు పాల్పడటమే కాకుండా, తమ దారుణాలకు మతం రంగు పులుముకుంటున్నారు. మతం పేర యువతను ఆకర్షించి మత విరుద్ధమైన కార్యాలకు సాధనాలుగా వాడుకుంటున్నారు. యువకులను ఉన్మాదులుగా మార్చి వారి చేత ఘోరమైన దాడులు చేయించి అమాయకులను హతమార్చడాన్ని ఏ మతం సమర్థించదు. స్పెయిన్ ఇప్పటికే వేర్పాటువాద దాడులతో ఎంతో క్షోభను అనుభవించింది. బాస్క్ స్వాతంత్ర్య పోరాటం పేర సాగిన పోరాటం ఇటీవలే నీరుగారిపోయింది. ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న దశలో మళ్ళా ఉగ్రవాద దాడి జరిగింది.

బార్సిలోనా నగరంలో దాడికి ఉగ్రవాదులు వాహనాన్ని ఎంచుకోవడం కూడా ఆందోళన కలిగిస్తున్నది. ఒకప్పుడు బాంబులు, తుపాకులతో దాడులు సాగేవి. తీవ్ర నిర్బంధం అమలు చేయడం ద్వారా యూరప్ ప్రభుత్వాలు ఈ దాడులను నిరోధించ గలుగుతున్నాయి. కానీ ఇటీవలి కాలంలో ఉగ్రవాదులు వాహనాలను సాధనాలుగా వాడుకుంటున్నారు. ఫ్రాన్స్ నగరంలోని నీస్ నగరంలో ఉగ్రవాదులు మొదటిసారిగా వాహనాన్ని ఆయుధంగా చేసుకొని దాడి చేశారు. గత ఏడాది జూలై పద్నాలుగవ తేదీన ఉగ్రవాదులు వాహనాన్ని జనంపై నడిపించి 86 మందిని బలిగొన్నారు. ఇస్లామిక్ స్టేట్‌కు మరో రూపమైన దాయిష్ ఉగ్రవాదు లు ఇందుకు బాధ్యులమని ప్రకటించారు. ఆనాటి నుంచి ఉగ్రవాదులు ఇప్పటి వరకు యూరప్‌లోనే మొత్తం ఎనిమిది సార్లు వాహనాల ద్వారా వివిధ నగరాలలో దాడులు సాగించి అనేక మంది ప్రాణాలను హరించారు. దాయిష్ ఉగ్రవాదులు గత ఏడాది ఆగస్టు 19న (దాదాపు ఏడాది కిందట) ప్యారిస్ నగరంలో వాహనాన్ని ఉపయోగించి రెండు చోట్ల దాడులకు పాల్పడ్డారు. కానీ ఎవరికీ ప్రాణ హాని జరుగలేదు. మార్చి ఒకసారి, జూన్‌లో రెండుసార్లు లండన్‌నగరంలో వాహనాలతో దాడు లు సాగాయి. ఒక దాడిలో ఐదుగురు, రెండవ దాడిలో ఎనమండుగురు, మూడవ దాడిలో ఒకరు మరణించారు. ఆ తరువాత దాడి డిసెంబర్‌లో బెర్లిన్ నగరంలో జరిగింది. ఈ దాడిలో పన్నెండు మంది బలయ్యారు. ఏప్రిల్ ఏడవ తేదీన స్టాక్‌హోంలో జరిగిన వాహన దాడిలో ఐదుగురు మరణించారు. ఈ విధంగా ఉగ్రవాదులు యూరప్‌లోని ఒక్కో నగరంలో దాడులు సాగిస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నారు. ఈ క్రమంలో జరిగిందే బార్సిలోనా దాడి.

బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, స్వీడన్, స్పెయిన్ ఇట్లా ఒక్కో దేశాన్ని లక్ష్యం చేసుకోవడం వల్ల యూరప్ ఖండం అప్రమత్తం అయింది. అయితే మారణాయుధాలు కాకుండా వాహనాలను వాడటం పెద్ద సమస్యగా మారింది. మారణాయుధాలను సేకరించడం, ఉపయోగించడం కష్టమైన పని. ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉన్నందువల్ల వాటి సరఫరా కూడా కష్టంగా మారింది. కానీ వాహనాలు లభించడం తేలిక. వాటిని ఉపయోగించే క్రమంలో అనుమానానికి తావుండదు. ఒక్కోసారి ఉగ్రవాదులు దొంగిలించిన వాహనాలను వాడుతున్నారు. తాజాగా మారుపేర తీసుకున్న వాహనాన్ని వాడారు. ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవడం కూడా సాధ్యం కాదు. అందువల్ల వాహనాల దాడులను ఉగ్రవాదులు ఎంచుకుంటున్నారు. ఒకప్పుడు నిర్దిష్ట ప్రాంతంలో ప్రాబల్యం ఉన్న శక్తుల మధ్య యుద్ధాలు జరిగేవి. అంతర్జాతీయంగా గుర్తింపు ఉన్న దేశాలు కాకున్నా, నిర్దిష్ట ప్రాంతంలో ఉన్న మిలిటెంట్లు పోరాడేవారు. వారితో చర్చలు జరిపి ఒక పరిష్కారం అన్వేషించడం సులభమయ్యేది. కనీసం ఒత్తిడి చేసి ఒక మేర

## అమెరికన్లకు ఉద్యోగాలిస్తున్నదే భారతీయులు



న్యూఢిల్లీ: అమెరికాలో అమెరికన్ల ఉద్యోగాలను భారతీయులు కొల్లగొడుతున్నారనే దుష్ప్రచారం ఎక్కువగా ఉంది. వాస్తవానికి ఇది పూర్తి విరుద్ధం. భారతీయులే ఎక్కువ మంది అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో ఎక్కువగా కంపెనీలను ఏర్పాటు చేసి భారతీయులతోపాటు అమెరికన్లకు, విదేశీయులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. కంప్యూటర్ హార్డ్‌వేర్‌లో పేరెన్నికగన్న 'సన్ మైక్రో సిస్టమ్స్' నుంచి ఈ మెయిల్ దిగ్గజం 'హాట్ మెయిల్' వరకు ఎన్నో ప్రసిద్ధ కంపెనీలకు ప్రాణంపోసి అమెరికన్లకు ఉద్యోగాలిచ్చింది భారతీయ వ్యాపారవేత్తలే.

భారత్‌లోని బెంగళూరు నుంచి అమెరికాలోని కాలిఫోర్నియా వరకు విస్తరించిన వెంచర్ క్యాపిటల్ సంస్థ 'ఇన్వెంటస్ క్యాపిటల్ పార్టనర్స్' డైరెక్టర్ మను రేఖి ఇటీవల విడుదల చేసిన ఓ నివేదికలో అమెరికాలో ఉద్యోగావకాశాలను పెంచిన భారత వ్యాపార దిగ్గజాల గురించి మరిన్ని వివరాలు పొందుపరిచారు. ఈరోజు అందరికి సుపరిచితులైన గూగుల్‌కు చెందిన సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్‌కు చెందిన సత్య నాదెండ్ల, పెప్సీ సీఈవో ఇంద్రా నూయి, అడోబ్స్‌కు చెందిన శంతను నారాయెణ్‌లు దశాబ్దాల క్రితమే అనేక భారతీయ సంస్థలకు బీజం వేశారు.

తొలితరం భారతీయ వ్యాపారవేత్తలు 1980 దశకంలో అమెరికాకు రావడం ప్రారంభమైంది. కన్వల్ రేఖి, వినోద్ ఖోస్లా, నరేన్ గుప్తా, ప్రభూ గోయల్, సుహాస్ పాటిల్ లాంటి వారెందరో సిలికాన్ వ్యాలీలో ప్రవేశించి సన్ మైక్రోసిస్టమ్స్ (తర్వాత ఓరాకిల్ స్వాధీనం చేసుకొంది), ఎక్సిలాన్, సైరస్ లాజిక్ లాంటి కంపెనీలను ఏర్పాటు చేసి ఎంతో మంది అమెరికన్లను ఉద్యోగావకాశాలను కల్పించాయని మను రేఖి తన నివేదికలో పేర్కొన్నారు. అమెరికాలో వినియోగదారుడి మనస్తత్వం ఎలా ఉంటుందో తెలియని దశలోనే అనేక మంది భారతీయ వ్యాపారవేత్తలు అమెరికాలోకి అడుగుపెట్టారు. కాలక్రమంలో వినియోగదారుడిని ఆకట్టుకోవడమే ప్రధాన లక్ష్యంగా భారతీయులు కంపెనీలను ఏర్పాటు చేయడం, విదేశీ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించడం ప్రారంభించారు.

ఈ దశలో సబీర్ భాటియా 1996లో హాట్‌మెయిల్ డాట్ కామ్ ఏర్పాటు చేయడం విప్లవాత్మక మార్పులు తెచ్చిందనడంలో సందేహం లేదు. ఆయన ఈ సంస్థను స్థాపించక ముందు భారత్‌లోని బిట్స్ బిలానీలో ఇంజనీరింగ్ డిగ్రీ చేసి, అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీలో ఎంఎస్ చేశారు. అనంతరం ఆపిల్ కంపెనీలో పనిచేసి, సొంతంగా హాట్ మెయిల్ కంపెనీని స్థాపించారు. 1990వ దశకంలోనే భారత సంతతికి చెందిన ఎంతోమంది వ్యాపారవేత్తలు సిలికాన్ వ్యాలీలో దిగ్గజాలుగా పైకొచ్చారు. 'నెట్‌స్కేలర్' అభివృద్ధికి ఎంతో కృషి చేసిన బీవీ జగదీష్, 2000 సంవత్సరంలో ఆ కంపెనీకి సీఈవో అయ్యారు. ఆయన ఇప్పటికీ కూడా కాజ్ వెంచర్స్‌లో మేనేజింగ్ పార్టనర్‌గా ఉంటూ అనేక స్టార్టప్ కంపెనీల్లో పెట్టుబడులు పెడుతున్నారు. మరోపక్క స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించేందుకు శాంటా క్లారా యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా స్టార్టప్ కంపెనీలపై విద్యార్థులకు క్లాసులు తీసుకుంటున్నారు.

## ఆ నియంతకు చెక్ పెడతాం : మమతా



కోల్‌కతా: నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశంలో నియంత పాలన సాగుతున్నదని విపక్షాలు ఏకతాటిపై నిలిచి 2019 ఎన్నికల్లో మార్పుకు నాంది పలుకుతాయని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. కేంద్రంపై ఎవరైనా విమర్శలు చేస్తే వారి ఇంటిపై ఈడీ, సీబీఐ, ఐటీ బృందాలను పంపుతున్నారని దాంతో మోదీ సర్కార్‌పై మాట్లాడాలంటే భయపడే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో బలమైన విపక్షం ఎలా సాధ్యమని ప్రశ్నించారు.

కేంద్రం తరచూ తననే టార్గెట్ చేస్తుండటాన్ని దీదీ ప్రస్తావిస్తూ తాను జీరో కాదని, హీరో అని ఇది తేటతేటం చేస్తున్నదని చెప్పారు. తాను క్షేత్రస్థాయి నుంచి పైకి వచ్చానని, ఎన్నో పోరాటాలు, ఎదురుదెబ్బలతో రాటుదేలానని అందుకే ఇంతలా పోరాట పటిమను ప్రదర్శించగలుగుతున్నానన్నారు. నియంత పాలనకు స్వస్తి పలికేందుకు విపక్షాలు ఏకతాటిపైకి వస్తే 2019 ఎన్నికల్లో మార్పుకు శ్రీకారం చుడతామన్నారు. మార్పు కోసం తాము వేచి చూస్తున్నామని, ఆరు నెలలు ఓపిక పడితే అన్ని విషయాలు కొలిక్కివస్తాయని మమతా అభిప్రాయపడ్డారు.

పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీతో దేశ ఆర్థిక వ్యవస్థ కుంటుపడిందని, ఎంతోమంది చిన్న వ్యాపారులు వ్యాపారం నుంచి విరమించుకుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

## నితీశ్, శరద్.. ఒకేరోజు.. వేర్వేరు సభలు

పట్నా: బిహార్ రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఇప్పటికే జేడీయూ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ మహాకూటమికి గుడ్‌బై చెప్పి భాజపాతో చేతులు కలిపిన విషయం తెలిసిందే. అయితే నితీశ్ నిర్ణయంపై ఆ పార్టీ వ్యవస్థాపకుడు శరద్‌యాదవ్ అసంతృప్తిగా ఉన్నారు. దీంతో ఇరువరి మధ్య భేదాభిప్రాయాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో జేడీయూ పార్టీ చీలిక దిశగా కదులుతోందని వూహాగానాలు వెలువడుతున్నాయి. తాజాగా నితీశ్ కుమార్, శరద్‌యాదవ్‌లు ఇద్దరూ ఒకేరోజు వేర్వేరుగా సమావేశాలు ఏర్పాటుచేయడంతో వూహాగానాలు మరింత బలపడుతున్నాయి.

నితీశ్ శనివారం తన అధికారిక నివాసంలో జేడీయూ జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. కాగా.. అటు శరద్ యాదవ్ కూడా నేడు పార్టీ నుంచి సస్పెండ్‌కు గురైన రాజ్యసభ సభ్యుడు అలీ అన్వర్ అన్సారీతో కలిసి జన అందోళన్ సమ్మేళన్ ఏర్పాటుచేశారు. దీంతో జేడీయూ పార్టీ రెండు వర్గాలుగా చీలిపోనుందని పుకార్లు వస్తున్నాయి. అయితే దీనిపై పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ త్యాగి మాట్లాడుతూ.. పుకార్లను కొట్టిపారేశారు. జేడీయూ ఎప్పటికీ విడిపోదని, అయితే శరద్ యాదవ్ స్వచ్ఛందంగా వెళ్లిపోతున్నట్లు చెప్పారు. పార్టీ మహాకూటమి నుంచి విడిపోయి భాజపాతో పొత్తు కుదుర్చుకుంది. దీన్ని ఆమోదించేందుకే నేడు జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం ఏర్పాటుచేసినట్లు చెప్పారు.

కాగా ఇప్పటికే మహాకూటమికి మద్దతుగా ఉన్న శరద్‌యాదవ్.. ఆగస్టు 27న భాజపాకు వ్యతిరేకంగా ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ నిర్వహించే ర్యాలీకి హాజరుకానున్నట్లు సమాచారం. దీనిపై త్వరలోనే శరద్ యాదవ్ ప్రకటన ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఇటీవలే జేడీయూ 21 మంది నేతలను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ శరద్ యాదవ్ వర్గానికి చెందిన 21 మందిని పార్టీ నుంచి తొలగించింది.

సమకవి సమయం

## 'శ్రమశక్తి'

సంగిడీలు యెత్తినోళ్ళు
బండి యిరుసు కదిపినోళ్ళు
కావెడితో బరువెంతో...?
ఆమడులు దూరాన నడకెంతో...?
సంగిడీలు యెత్తినా...?
బండి యిరుసు కదిపినా...?
తెలుగు నేల పుట్టినోళ్ళు
అలుపెరగనివోళ్ళు
తాటిచెట్లు లాగుట
తాటి చెట్లు కుదుపుట
మాకెంతో...?
పిడికెడు నువ్వులు
చేతితో నలుపుట సులువంటు...
రేవు టెండ, కేవుటోళ్ళు
కావెడులు బరువుతో...
ఒంటి మీద గుడ్డముక్క
చమటలు తడుపుతో...
ఆమడల దూరాలు
అడుగడుగులు శ్రమలతో...
కృష్ణ, గోదారి నదులు కాలవలు నీటితో...
దుక్కుటేరు దుక్కులతో...
ఎడ్లబళ్ళు బరువులతో
భూములు సాగు చేసే రైతోరు
పురిటి నొప్పి లెక్కలేదు (పురిటి నొప్పులున్నను)
బాలింతర 'నడుంకు' గుడ్డ గట్టి
పసికందును వీపున
సెంగుతో సరిగట్టి
ఒంగొంగి పొలాన ఉడుపులతో... గొప్పులతో...
స్త్రీ జాతి పొలం పనులు శ్రమవాళ్ళు
చమురు సహజ వాయువు నిక్షేపాలు
సముద్ర గర్భం నుండి యంత్ర పరికరాలతో వెలికితీస్తూ...
మత్స్య సంపదకు కడలి తల్లిని నమ్మి, పొటుకు పయనం పడవులతో
కెరటాలకు యెదురీదుతు పొద్దంత సంద్రాన
పుడమితల్లి వెలిగింది బాగుగోరి ఎంతెంతో...
సంపద కావాలి మరింత
భారతావనికి
వారి శ్రమలు దైవానికెరుకు
శ్రమభాగ్యం వారిదే...
శ్రమ పంటలు వారివే...

...కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు
సెల్ నెం:9290839512

## పంచాంగం

మాసం : శ్రావణ : తిథి : చతుర్దశి రా.1.59 పుష్యమి సా.6.01; వర్జ్యం లేదు

ఆదివారం 20-08-2017

**మేషం** : యాదృచ్ఛికంగా ఒక పుణ్యక్షేత్రం సందర్శిస్తారు. గతంలో మిమ్ములను విమర్శించిన వారే మీ సహాయం అర్థిస్తారు. **వృషభం** : వృత్తిపరమైన ఆటంకాలు క్రమంగా తొలగిపోగలవు. దంపతుల మధ్య సఖ్యతాలోపం, కలహాలు చోటు చేసుకుంటాయి. కొన్ని విషయాల్లో మీరెంత తెలివిగా వ్యవహరించినా ఫలితాలు భిన్నంగానే ఉంటాయి. **మిధునం** : తలపెట్టిన పనులు వేగవంత మవుతాయి. విదేశీ యత్నాలు వాయిదాపడతాయి. బ్యాంక్ వ్యవహారాలలో మెళకవ వహించండి. **కర్కాటకం** : ఉద్యోగస్తులకు పెండింగ్ పనులపై దృష్టి సారిస్తారు. ఆలయాలను సందర్శిస్తారు. స్టాక్ మార్కెట్ రంగాల వారి అంచనా నిరుత్సాహపరుస్తాయి. ఏ విషయంలోను హామీ ఇవ్వకుండా లౌక్యంగా దాటవేయండి. **సింహం** : ప్రయాణ లాభం, ఆదాయానికి మించి ఖర్చులు చేస్తారు. శుభకార్యాలపై దృష్టి పెడతారు. మీ ఆలోచనలు ఫలిస్తాయి. రుణాలు చేస్తారు. పెండింగ్ వ్యవహారాలు పూర్తి చేస్తారు. **కన్య** : విందు, వినోదాలు, దూర ప్రయాణాలు చేస్తారు. కోర్టు వాదోపవాదాల్లో ప్లీడర్లు విజయం సాధిస్తారు. మీ శ్రీమతి సహాయం లేనిదే మీ సమస్యలు పరిష్కారం కావని గ్రహించండి. ఇతరుల మెప్పుకోసం శ్రమాధిక్యత, ఒత్తిడి ఎదుర్కొనవలసివస్తుంది. **తుల** : రవాణా రంగాలలోని వారికి చికాకులు తప్పవు. బంధువుల రాకతో గృహంలో సందడి కానవస్తుంది. పెట్టుబడుల విషయంలో పునరాలోచన చాలా అవసరం. **వృశ్చికం** : వ్యాపారాల్లో నిలదొక్కుకోవటానికి మరింతగా శ్రమించ వలసి ఉంటుంది. ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. ప్లీడర్లకు, ప్లీడరు గుమస్తాలకు, వైద్యులకు అనుకూలత. **ధనుస్సు** : విద్యార్థులకు మిత్రబృందాల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది మెళకువ వహించండి. బ్యాంకు వ్యవహారాలలో అపరిచిత వ్యక్తులపట్ల మీ కృషికి తగిన ప్రతిఫలం ఉంటుంది. **మకరం** : న నిర్మాణ పనులలో జాప్యం, అధిక వ్యయం వల్ల ఆందోళనకు గురవుతారు. రావలసిన ధనం వాయిదాపడుట వల్ల ఆందోళనకు గురవుతారు. **కుంభం** : వృత్తి వ్యాపారాలు అనుకూలించిననూ కోపం అధికం వలన అందరితోను విరోధాలు కలుగును. **మీనం** : విందు వినోద కార్య క్రమాల్లో పాల్గొంటారు.

## దేవ దేవుడు.. శ్రీ వేంకటేశుడు

సంకీర్తన



**వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన**
**వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి**

బ్రహ్మాండంలో వేంకటాద్రికి సమానమైన పుణ్యక్షేత్రం లేదు. అలాగే శ్రీనివాసుడికి సాటిరాగల దేవుడు ఇటు భూతకాలంలో కానీ.. అటు భవిష్యత్తులో కానీ మరెవరూ ఉండరు... ఇదీ శ్లోకానికి అర్థం.

తిరుమల పుణ్యక్షేత్రం కలియుగ వె%కుంఠమని ప్రసిద్ధి. ఈ ప్రశస్తికి మూలకారణం.. స్వయం వ్యక్త స్వరూపంలో వెలిసిన శ్రీవేంకటేశ్వరుడు. తిరుమలగిరిపై పవిత్రాద్భుతమైన ఒక సాలగ్రామశిల ద్వారా స్వయంభూగా వెలసిన శ్రీ వేంకటేశ్వరుణ్ణి శ్రీనివాసుడని, సప్తగిరీశుడని, ఏడుకొండలవాడని, బాలాజీ, తిరుమలప్ప, తిమ్మప్ప అని.. ఇలా ఎన్నో పేర్లతో భక్తజనులు ఆర్తిగా సంబోధిస్తూ ఉన్నారు. ఆనందనిలయుడె%న శ్రీవారు నెలకొన్న బంగారు మందిరానికి ఆనంద నిలయమనే వ్యవహారం అనాదిగా ప్రసిద్ధమై ఉంది.

**స్థలపురాణం**

కలియుగారంభంలో... అనగా సుమారు 5వేల సంవత్సరాల క్రితం.. వక్ష స్థల మహాలక్ష్మి సమేతంగా ఆవిర్భవించిన శ్రీనివాసునికి తరతరాలుగా ఎందరో భక్తులు మందిర, గోపుర, ప్రాకార, మహా ద్వారాలు నిర్మిస్తూ వచ్చారు. వేంకటపతికి నిత్యోత్సవ, వార్షికోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. నారాయణ వనం అధిపతులు ఆకాశరాజు, తొండమాన్ చక్రవర్తి, పల్లవరాణి సామవై, విజయనగర సామ్రాజ్యాధీశులు సాళువ నరసింహ రాయలు, శ్రీకృష్ణదేవ రాయలు, తిరుమలరాయలు, అచ్యుత రాయలు ఇలా.. ఎందరో మహానుభావులు.. ఇక్కడ అద్భుత నిర్మాణాలను చేపట్టి అపూర్వసేవా కైంక ర్యాల నెలవుగా తిరుమల క్షేత్రాన్ని తీర్చిదిద్దారు.

శ్రీవారిని దర్శించుకునే భక్తులు ముందుగా క్షేత్రపాలకుడైన వరాహస్వామివారిని దర్శించుకోవాలని స్థలపురాణంలో ఉంది. అలాగే స్వామి వారి దర్శనానంతరం... తిరుపతిలో పద్మావతి /బీబీనాంచారి/ అలివేలుమంగ అమ్మవారిని, గోవిందరాజస్వామి వారిని దర్శించుకోవాలి. తిరుమలగిరులలో ఉన్న పవిత్ర ఆకాశ గంగ.. పాపనాశనం.. వకుళమాత ఆలయం,, హాథీరాంజీ మఠం.. త్రిదండి జీయర్‌స్వామివారి మఠం.. వన్యప్రాణుల పార్క్.. వంటి ఆధ్యాత్మిక-పర్యాటక ప్రాశస్త్య మున్న ప్రాంతాల్ని దర్శించుకోవచ్చు. తితిదే బస్సు సర్వీసులతో పాటు ఆయా ప్రదేశాలకు ప్రైవేటు వాహ నాలూ అందుబాటులో ఉంటాయి. తలనీలాలు మొక్కు బడి ఉన్నవారు తప్పనిసరిగా స్వామివారి కల్యాణకట్ట వద్దనే తలనీలాలు సమర్పించాలి

**శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శన వేళలు**

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ప్రత్యేక దర్శన వేళలు ఒక్కోరోజు ఒక్కోవిధంగా ఉంటాయి. స్వామివారికి జరిగే నిత్య, వారపు సేవలను బట్టి ఆయా సమయాలను తితిదే నిర్దేశించింది. టిక్కెట్లను ముందస్తుగా అంతర్జాలం, ఈ-దర్శన్, తపాలా శాఖ ద్వారా విక్రయిస్తోంది. ఉదయం నుంచి సాయంత్రంలోపు నిర్దేశించిన సమయంలోపు శ్రీవారిని దర్శించుకునే వేళలను ఎంపిక చేసుకోవచ్చు. ఎంపిక చేసుకున్న సమయం టిక్కెట్టుపై ముద్రితమవుతుంది. ఈ సమయానికి మాత్రమే ఆలయానికి చేరుకోవడానికి వరుస వద్దకు రావాల్సి ఉంటుంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లను నిత్యం రూ.300 ధర వంతున 26వేల టిక్కెట్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. 56 రోజులకు ముందుగా టిక్కెట్లను పొందే అవకాశం ఉంది. విశేష పర్వదినాల్లో రద్దీని దృష్టిలో ఉంచుకుని టిక్కెట్ల సంఖ్యను దేవస్థానమే తగ్గిస్తుంది.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# శిక్షణను సద్వినియోగం చేసుకోండి

## జిల్లా ఎస్పీ రాజశేఖర్‌బాబు


చిత్తూరు : పోలీసు శాఖలో పురుషులే కాదు.. మహిళలు కూడా వారి శక్తిని చూపించాలి. మహిళలకు మేమున్నామనే ధైర్యాన్ని కల్పించాలని జిల్లా ఎస్పీ రాజశేఖర్‌బాబు కోరారు. చిత్తూరులోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో 9 నెలల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు పురుషులకు ధీటుగా విధులు చేపట్టాలని తెలిపారు. నిజానికి మహిళలే.. సున్నితత్వం.. కఠినత్వంగానూ ఉండగలరని, అలాంటి వారు అందరికీ న్యాయం చేయగలరని చెప్పారు. 9 నెలల శిక్షణా కార్యక్రమంలో అందరూ పూర్తిస్థాయిలో శిక్షణ పొందాలని తెలిపారు. మెలకువలను నేర్చుకుని.. విధి నిర్వహణలో వాటిని ఉపయోగించాలన్నారు. మీ నేర్పును అందరూ గుర్తించి.. మీ విధులు స్టేషన్‌కు అవసరమని కోరుకునేలా శిక్షణ పొందాలని చెప్పారు.

ముఖ్యంగా కంప్యూటర్ పరిజ్ఞానంలో కూడా ముందుండా లన్నారు. ప్రస్తుతం నేరాలను చేదించడంలో రాతలు, పరుగు వంటివి కాదని, శాంకేతిక పరిజ్ఞానమే ముఖ్యమన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరు అన్ని విభాగాల్లో మంచి ప్రావీణ్యాన్ని పొందాలని చెప్పారు. శిక్షణను పూర్తి చేసుకుని.. విధులకు వెళ్లే వారు పోలీసు పేరును నిలబెట్టాలని తెలిపారు. ఎలాంటి బెదిరింపులకు లొంగకుండా ధైర్యంగా విధులు చేసేలా ఎదగాలని సూచించారు. పోలీసు శిక్షణా కేంద్రం లో శిక్షణ పొందే మహిళా అభ్యర్థినుల కోసం సౌకర్యాలు బాగుండటంతో శిక్షణా కేంద్రం అధికారులను అభినందించారు.

అభ్యర్థినులకు ఎలాంటి అవసరం ఉన్నా.. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు అదనపు ఎస్పీ రాధిక, శిక్షణా కేంద్రం డీఎస్పీ వెంకటయ్య, డీఎస్పీలు రమణ య్య, దేవదాసు, సుబ్బారావు, రామకృష్ణ, గిరిధర్, తదితరులు పాల్గొన్నారు.

# రహదారుల వెంట అత్యవసర వైద్య కేంద్రాలు ఏర్పాటు చేయాలి

## శాసనసభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు



తాడేపల్లి : రహదారుల వెంట ప్రభుత్వ పరంగా అత్యవసర వైద్యసేవ కేంద్రాలు ఏర్పాటు చేస్తే అందరికీ ఉపయుక్తంగా ఉంటుందని శాసన సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మణిపాల్ వైద్యశాలలో ట్రామా, ఎమర్జెన్సీ యూనిట్, డేకేర్ ఎండోస్కోపీ విభాగాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాసరావుతో కలిసి డాక్టర్ కోడెల శివప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సభాపతి కోడెల శివప్రసాదరావు మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు మొదటి గంటలోనే వైద్య సేవలు అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చని చెప్పారు. అలాంటి వైద్యం అందించాలంటే అత్యవసర వైద్య సహాయ కేంద్రాల ద్వారా సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరి ఆర్థిక స్తోమతను బట్టి కాకుండా వ్యాధిని బట్టి వచ్చిన సమస్యను అందరకీ నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. రాష్ట్రంలో 5కోట్ల మంది జనాభా బీమా పరిధిలోకి వస్తే ఆయా కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ, సీఎం సహాయనిధి నుంచి ఏ రాష్ట్రంలో లేనివిధంగా బాధితులకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. వైద్యఆరోగ్య శాఖామంత్రి కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ పేదలను దృష్టిలో ఉంచుకుని ఎన్టీఆర్ వైద్యసేవలో మరో 106 రకాల వ్యాధులను చేర్చినట్లు తెలిపారు. ఇంకా ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యసేవలు మెరుగు పర్చాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం అన్ని వైద్యశాలల్లో పారిశుద్ధ్య సమస్య పెరిగిందని చెప్పారు. రాష్ట్రంలో డయాలసిస్ సెంటర్లను ప్రారంభించామని తెలిపారు. వైద్యశాలల్లో చికిత్స పొందుతూ చనిపోయే వారిని ఇంటికి తీసుకు వెళ్లేందుకు మహాప్రస్థాన వాహనాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి నిధులు కేటాయించారని తెలిపారు.

అమరావతి నగరం మెడికల్ హబ్‌గా మారుతోందని తెలిపారు. మణిపాల్ వైద్యశాల యూనిట్ అధిపతి డాక్టర్ సుధాకర్ కంటిపూడి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల వారికి అత్యున్నతమైన వైద్యసేవలు అందించటానికి మణిపాల్ ముందుంటుందని చెప్పారు. ట్రామా, ఎమర్జెన్సీ ఇన్‌ఛార్జి డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

# జాతీయ రహదారుల భూసేకరణ వేగవంతం

## జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న



చిత్తూరు : జిల్లాలో జాతీయ రహదారుల కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న అధికారులను ఆదేశించారు. జిల్లా సచివాలయంలో జాతీయ రహదారుల నిర్మాణం, భూసేకరణ అంశాలపై ఎన్‌హెచ్‌ఏఐ, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ.. నాయుడుపేట-చిత్తూరు ఆరు వరుసల రహదారికి భూసేకరణ వేగంగా చేపట్టాలన్నారు. నాయుడుపేట నుంచి వయా తిరుపతి, పూతలపట్టు, కాణిపాకం మీదుగా చిత్తూరులోని చెన్నై-బెంగళూరు జాతీయ రహదారికి అనుసంధానిస్తూ ఆరు వరుసల రహదారి నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. రహదారికి అవసరమైన భూములను 20 రోజుల్లో సర్వే పూర్తి చేసి నివేదిక సమర్పించాలని సర్వే, రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. రహదారిలో మలుపులు ఎక్కువ లేకుండా వేగంగా వెళ్లడానికి అనువుగా భూములు ఎంపిక చేయాలన్నారు. రహదారి నిర్మాణ డిజైన్‌ను వేగానికి అనుకూలంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉండేలా చూడాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను ఆదేశించారు. మదనపల్లె-తిరుపతి నాలుగు వరుసల రహదారి రోడ్లు సర్వే పనులపై సమీక్షించారు. జిల్లా పరిధిలో చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి విస్తరణ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలన్నారు. భూసేకరణలో ఎక్కడైనా సమస్యలు ఉండే సత్వరం రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకొని పరిష్కరించాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త పాలనాధికారి పీఎస్ గిరీష, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ శ్రీనివాసులునాయుడు, సర్వే ఏడీ జలీల్, చిత్తూరు ఆర్డీవో కోదండరామిరెడ్డి, ఆయా మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

# సమీకృత వ్యవసాయ విధానాలతో లాభాలు



ముమ్మిడివరం : సమీకృత వ్యవసాయ విధానం(ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టమ్) వల్ల కలిగే ప్రయోజనాలను రైతులు గుర్తించి ఆ దిశగా ముందుకుసాగి ఆదాయ మార్గాలను పెంచుకోవాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ పి.పద్మజ సూచించారు. ముమ్మిడివరంలోని ఏడీఏ కార్యాలయం వద్ద ఏడీఏ ఎం.ఎ.షంషీ అధ్యక్షతన నిర్వహించిన ఆత్మ ఏఎంసీ స్థాయి సమావేశంలో పద్మజ పాల్గొని మాట్లాడారు. సమీకృత వ్యవసాయ విధానంలో రైతులు వ్యవసాయ సాగుతో పాటు పాడి, చేపల పెంపకం, ఉద్యాన పంటలు సాగు చేయడం వల్ల అధిక ఆదాయం

## ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ పి.పద్మజ

పొందవచ్చన్నారు. వీటికి ఆత్మ ఆధ్వర్యంలో రాయితీలు కల్పిస్తారని వివరించారు. రైతులను వివిధ పంటల సాగులో ప్రోత్సహించడానికి అనుబంధ రంగాల రైతులను విజ్ఞాన యాత్రలకు తీసుకెళ్తారని.. దీనికయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ తెలిపారు.

ఈ సందర్భంగా వరిసాగులో యాంత్రీకరణ.. ప్రస్తుత సాగులో చేపట్టాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ఏడీఏ ఎం.ఎ.షంషీ మాట్లాడుతూ రైతులు అంతర్జాలాన్ని వినియోగించి వ్యవసాయ సాగులో ఎన్నో నూతన విషయాలు తెలుసుకోవచ్చన్నారు. రైతులకు యాంత్రీకరణ, ఎరువులకు సంబంధించి డీబీటీ (డైరెక్ట్ బెనిఫీషరీ ట్రాన్స్‌ఫర్), ఈ వ్యవసాయ పంటల నమోదు (ఈ క్రాప్ బుకింగ్) తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ముమ్మిడివరం మండల వ్యవసాయాధికారి వై.మధుకుమార్ మాట్లాడుతూ ఈనెల 25 నుంచి సామూహిక ఎలుకల నివారణకు బ్రోమోడయోలోన్ మందును పంపిణీ చేస్తారన్నారు. అంతకుముందు గాడిలంక గ్రామంలో వరిచేలను ఆత్మ పీడీ పద్మజ పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ పి.వి.ఎన్.నాగాచారి, ఉద్యాన శాఖ అధికారి పి.అమరనాథ్, పి.లక్ష్మీదుర్గ, కె.కౌసల్య, పి.శ్రీనివాసరావు, మత్స్యశాఖ అధికారి మీనాకుమారి, డి.స్వామి, పెద్దిరెడ్డి మునీంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# గండికోట చారిత్రక విశేషాలు పంపాలని ఆదేశం

జమ్మలమడుగు : గండికోటకు సంబంధించిన చారిత్రక విశేషాలను 2016 యునెస్కో నిబంధనల ప్రకారం పంపాలని రాష్ట్ర పురావస్తుశాఖ ఉన్నతాధికారులకు కేంద్ర పురావస్తు మంత్రిత్వశాఖ నుంచి ఆదేశాలు అందాయి. కోటకు సంబంధించిన పూర్తి వివరాలను వెంటనే పంపాలని కేంద్ర ప్రభుత్వ పురావస్తుశాఖ నిర్దేశకుడు డా.ప్రవీణ్‌కుమార్ మిశ్రా...నూతనంగా ఏర్పాటైన అమరావతి సర్కిల్ సూపరింటెండెంట్ ఆర్కియాలజిస్ట్ డా.శ్రీలక్ష్మిని ఆదేశించారు. గండికోటకు ప్రపంచ వారసత్వ హోదా (యునెస్కో గుర్తింపు) లభించేందుకు కోటకు సంబంధించిన ఫొటోలు, రేఖాపటాలు, చరిత్ర సమగ్ర వివరాలను సేకరించేందుకు సలహాదారును సైతం నియమించుకోవాలని వారికి పంపిన లేఖలో పేర్కొన్నారు.

ఇప్పటివరకు 35 కట్టడాలను యునెస్కో గుర్తించింది. మన రాష్ట్రంలో ప్రముఖమైన కట్టడాలు 129 ఉన్నా ఒక్కదానికి కూడా వారసత్వ హోదా లేకపోవడం విచారకరం.

ఇటీవలకాలంలో జిల్లా కలెక్టర్ బాబురావునాయుడు చొరవతో కోటలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ట్రెక్కింగ్, పెన్నా లోయలో బోటు విహారం, కొండలు ఎక్కడం తదితర సాహస క్రీడలకు సంబంధించిన విషయాలపై బెంగళూరుకు చెందిన ఓ సంస్థ నిర్వాహకులు పరిశీలించి వెళ్లారు. రాష్ట్రానికే తలమానికమైన గండికోటను ఇప్పటికైనా నిర్లక్ష్యం చేయకుండా వారసత్వ హోదా వచ్చేలా కృషిచేసి అంతర్జాతీయ స్థాయిలో పర్యాటకులను ఆకర్షించాలని పలువురు కోరుతున్నారు.

# ఎస్సీ వర్గీకరణపై భాజపా మాట నిలబెట్టుకోవాలి

లాడ్జికూడలి : భాజపా అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి, అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు గడిచాక వర్గీకరణ సాధ్యం కాదని మాట మార్చడం హేయమని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు మాదిగ మండిపడ్డారు. స్థానిక లాడ్జికూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భాజపా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేయాలంటే రాజ్యాంగ నియమాలు ఒప్పుకోవని భాజపా సభ్యులు మాట్లాడటం తగదన్నారు. పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు ఎప్పుడు పెడతారని ఎంపీలు అడిగితే కేంద్ర మంత్రి గెహ్లాట్ వర్గీకరణ చేయాలంటే ఆర్టికల్ 341ను రాజ్యాంగ సవరణ చేయాలని, అందుకోసం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అభిప్రాయం తీసుకోవాలనటం దారుణమన్నారు.

రానున్న పార్లమెంట్ సమావేశాలల్లోనైనా ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లవరపు రవిరాజా, ప్రేమ్‌కుమార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వూపిరి ఉన్నంత వరకూ పోరాటం

## మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం



కిర్లంపూడి : కాపు రిజర్వేషన్ల కోసం వూపిరి ఉన్నంత వరకు పోరాటం చేస్తానని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అన్నారు. కిర్లంపూడిలో పద్మనాభం చేపట్టిన పాదయాత్రకు 24వ రోజు కూడా పోలీసులు అడ్డుతగడంతో కాపు సంఘాల నాయకులు ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయాలని నిర్ణయించారు. ముద్రగడ ఇంటి గేటు వద్ద భైటాయించి నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా ముద్రగడ పద్మనాభం మాట్లాడుతూ ప్రభుత్వం ఎత్తుగడలకు మోసపోవద్దని, కాపులంతా విజ్ఞతతో ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. శాంతియుత నిరసనలు చేసి ప్రభుత్వానికి కంటిపై కునుకు లేకుండా చేయాలన్నారు. కాపుల్లో చాలామంది దుర్భర జీవనం గడుపుతున్నారని, వీరి స్థితిగతులు మెరుగు పరచాలని పోరాడుతున్నామన్నారు. ఐకాస రాష్ట్ర కోకన్వీనర్ ఆకుల రామకృష్ణ మాట్లాడుతూ మూడేళ్ల నుంచి ముఖ్యమంత్రి చెప్పిందే చెబుతున్నారని విమర్శించారు. ముద్రగడ సారధ్యంలో కాపు రిజర్వేషన్లు సాధించి తీరుతామన్నారు. ఐకాస రాష్ట్ర నాయకుడు వాసిరెడ్డి ఏసుదాసు మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముఖ్యమంత్రి విఫలమయ్యారన్నారు. ఇంకెంతకాలం కాపులను మోసం చేస్తారని ప్రశ్నించారు. ఐకాస న్యాయవాద రాష్ట్ర నాయకుడు ఆరేటి ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా పోలీసు యాక్టు 30ను నిరుపయోగం చేస్తున్నారన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం నుంచి వచ్చిన కాపు సంఘం నాయకుడు ముత్యం శ్రీరామ్ ఆధ్వర్యంలో కిర్లంపూడిలో సర్వమత ప్రార్థనలు చేశారు. తుని నియోజకవర్గం ఎస్.సూరవరానికి చెందిన నర్సే శివాజీ ఆధ్వర్యంలో కాపు సంఘాల నాయకులు తరలివచ్చారు. కత్తిపూడి, పిఠాపురం, పెద్దాపురం, ప్రత్తిపాడు, కాకినాడ, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. కాపు సంఘ జిజిల్లా మహిళా అధ్యక్షురాలు ఆకుల భాగ్యలక్ష్మి, గౌతు సుబ్రహ్మణ్యం, తోట బాబు, చెక్కపల్లి సత్తిబాబు, వంగా నరసింహా రావు, పాండురంగారావు, కె.శ్రీనివాసరావు, సంగిశెట్టి వెంకటేశ్వరరావు, తలిశెట్టి వెంకటేశ్వరరావు, సర్పంచి పెంటకోట నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఐటీ స్థల పరిశీలన

తొండంగి: తొండంగి మండలంలోని దానవాయిపేటలో ట్రిపుల్ ఐటీ కళాశాలను ఏర్పాటు చేసేందుకు 2012లో 100 ఎకరాల స్థలం కేటాయించారు. అప్పట్నుంచి ఆ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదు. దాంతో చుట్టుపక్కల వారు సరుగుడు తోటలు సాగు చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్య డైరెక్టర్ ఎస్పీ శ్రీకాంత్, డిప్యూటీ డైరెక్టర్ కేశవరావు, ఆర్జేడీ సత్యనారాయణమూర్తి, ఇతర బృందం తహసీల్దారు సూర్యనారాయణతో కలిసి ఆ స్థలాన్ని పరిశీలించారు. స్థలం సరిహద్దుల వివరాలు సర్వేయర్ ఆచారిని అడిగి తెలుసుకున్నారు.

# నగరపాలక కార్యాలయంలో అగ్ని ప్రమాదం

## పరిపాలనా విభాగంలో దగ్ధమైన ఫైళ్లు, ఇతర సామగ్రి



రాజమహేంద్రవరం : రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ కార్యాలయంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని కమిషనర్ విజయ్‌రామరాజు ప్రకటించారు. కమిషనర్ కార్యాలయం కిందనున్న పరిపాలన విభాగంలో ప్రధాన విద్యుత్తు బోర్డు నుంచి పెద్ద శబ్దం వచ్చింది. విధుల్లో ఉన్న భద్రత సిబ్బంది అప్రమత్తమయ్యారు. అప్పటికే బోర్డు నుంచి మంటలు రేగడాన్ని గమనించారు. పరిపాలనా విభాగానికి సంబంధించి రోజువారీ ఫైల్స్‌ను యథావిధిగా టేబుళ్లపై వదిలేయడంతో అగ్నికి ఆహుతయ్యాయి. పరిస్థితిని గమనించిన సెక్యూరిటీ గార్డ్ రమేష్ విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో ప్రమాద తీవ్రత తగ్గింది. అనంతరం ఆర్యాపురం ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగారు. 15 నిమిషాల్లో పరిస్థితిని అదుపులోకి తీసుకురాగలిగారు. మంటలు పక్కనున్న అకౌంట్స్ విభాగం, రికార్డు గదులకు తాకక ముందే సిబ్బంది నిలువరించడంతో నష్టతీవ్రత తగ్గింది. ఈ ప్రమాదంలో పరిపాలన విభాగంలో ఉన్న ఉపాధ్యాయులు, నగరపాలకసంస్థ ఉద్యోగుల సర్వీస్ రికార్డులు, రిజిష్టర్లు కొంత మేర దగ్ధమయ్యాయి. తొంభైశాతం పైగా రికార్డులన్నీ భద్రంగానే ఉన్నాయని కమిషనర్ తెలిపారు. కాలిపోయిన కంప్యూటర్లలో హార్డ్‌డిస్క్‌లు బాగానే ఉన్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఈ-ఆఫీసు విధానంలో ఆన్‌లైన్ చేయడం వల్ల సమాచారం భద్రంగా ఉందన్నారు. ఒకవేళ లేకపోయినా ట్రెజరీ, ఆర్డీ కార్యాలయం, డీఎంఏ కార్యాలయంలో సమాచారం లభ్యమవుతుందని తెలిపారు. ప్రమాద నష్టం రూ.5 నుంచి రూ.8 లక్షల వరకూ ఉంటుందని వెల్లడించారు. ప్రమాదం జరిగిన తర్వాత సిబ్బంది వెంటనే రికార్డులను కౌన్సిల్ హాలుకు తరలించారు. శాఖల వారీగా పరిశీలన చేసే ప్రక్రియను చేపట్టారు. పరిపాలన విభాగం గదిని ఆనుకుని అకౌంట్ విభాగం, రికార్డు గది, పైన కమిషనర్, అదనపు కమిషనర్, మెప్మా కార్యాలయాలు ఉన్నాయి.

నూతన భవనం నిర్మించినప్పటికీ ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయాలనే ఉద్దేశంతో ఉన్నారు. ప్రస్తుత ఈ పురాతన భవనం 1857లో నిర్మించారు. కొంతకాలం సైన్స్ మ్యూజియంగా వినియోగించేవారు. తర్వాత కాలంలో మున్సిపల్ ప్రధాన కార్యాలయంగా వినియోగిస్తున్నారు. సంఘటన తర్వాత మేయర్ పంతం రజనీశేషసాయి, అర్బన్ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ, ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తదితరులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. జరిగిన సంఘటన దురదృష్టకరమని మేయర్ అన్నారు. సిబ్బంది సకాలంలో స్పందించడం వల్ల పెద్దప్రమాదం తప్పిందన్నారు. ప్రధానమైన రికార్డులు భద్రంగానే ఉన్నాయన్నారు.

ఇక్కడికొచ్చిన ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావుకు, ప్రతిపక్షాలకు మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసు కుంది. ముందుగా ఆదిరెడ్డి భవనంలోకి వెళ్లి కాలిపోయిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్నారు. అదే సమయంలో వైకాపా ఫ్లోర్ లీడర్ మేడపాటి షర్మిళారెడ్డి, కార్పొరేటర్లు మింది నాగేంద్ర, బాపన సుధారాణి, మజ్జి నూకరత్నం, పార్టీ నాయకుడు మజ్జి అప్పారావు తదితరులు కలిసి వచ్చారు. ఫైళ్లు పూర్తిగా కాలిపోయాయని అనడంతో, ఆ మాటలు విన్న ఆదిరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. దీంతో పరస్పర మాటల యుద్ధం నడిచింది. ప్రతి విషయాన్ని విమర్శించేందుకు సిద్ధపడడం తగదని ఎమ్మెల్సీ అన్నారు. అయితే ప్రతిపక్షాలు మాత్రం జరిగిన సంఘటనపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశాయి. అప్పుడే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని విలేకర్లతో మాట్లాడుతూ అన్నారు. ఇదిలా ఉండగా జరిగిన ఘటన యాదృచ్ఛికమా లేదా ఎవరిదైనా హస్తం ఉందా అనేదానిపై తీవ్ర చర్చ జరుగుతోంది.

## డయాబెటిస్‌ను తగ్గించే

# నల్ల మిరియాల డ్రింక్...



ప్రపంచ వ్యాప్తంగా అధిక శాతం మందికి వస్తున్న వ్యాధుల్లో డయాబెటిస్ ఇప్పుడు అగ్రస్థానంలో కొనసాగుతోంది. టైప్-1 కన్నా నేడు అధిక శాతం మంది టైప్-2 డయాబెటిస్ బారిన పడుతున్నారు. ఇందుకు కారణాలు కూడా అనేకం ఉంటున్నాయి. జన్యువుల ప్రభావం, జీవనం, ఆహార శైలిలో మార్పులు, దీర్ఘకాలిక వ్యాధులు, స్థూలకాయం ఇలా కారణమేమున్నా నేడు అధిక శాతం మంది టైప్-2 డయాబెటిస్ బారిన పడి ఇతర సమస్యలను కూడా కొని తెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో వారు నిత్యం వ్యాయామం చేయడంతోపాటు సరైన పౌష్టికాహారాన్ని తగిన సమయానికి తీసుకోవడం అనివార్యంగా మారింది. అయితే వీటితోపాటు నల్ల మిరియాలతో చేసే ఓ డ్రింక్‌ను రోజూ తాగడం వల్ల కూడా డయాబెటిస్‌ను నియంత్రించుకోవచ్చు.

అంతేకాదు బరువు తగ్గేందుకు, శరీర నొప్పులు తగ్గించుకునేందుకు, శక్తి కోసం, మలబద్ధకాన్ని నివారించేందుకు, డీహైడ్రేషన్‌కు గురి కాకుండా, ఆకలిని కంట్రోల్ చేయడానికి, ఎముకల బలం కోసం కూడా ఈ డ్రింక్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇప్పుడు నల్ల మిరియాల డ్రింక్‌ను ఎలా తయారు చేయాలో తెలుసుకుందాం.

**కావల్సిన పదార్థాలు...**

నీరు - 2 కప్పులు
నల్ల మిరియాల పొడి - 2 టీస్పూన్లు
ఉప్పు - తగినంత
గులాబీ పువ్వు రెక్కలు - కొద్దిగా

**తయారీ విధానం...**

ఒక చిన్న బౌల్‌లో 2 కప్పుల నీటిని తీసుకుని అందులో 2 టీస్పూన్ల నల్ల మిరియాల పొడిని వేసి బాగా కలపాలి. అనంతరం ఆ ద్రవాన్ని మరిగించాలి. కొద్దిగా మరిగాక అందులో కొంత ఉప్పు, కొన్ని గులాబీ పువ్వు రేకులను వేయాలి. అనంతరం మళ్లీ ఆ ద్రవాన్ని మరిగించాలి. ద్రవం మరిగాక దాన్ని దించి గోరు వెచ్చని స్థితి వచ్చే వరకు చల్లార్చాలి. తరువాత వడకట్టి తాగేయాలి. అయితే ఈ డ్రింక్‌ను నిత్యం రెండు సార్లు తీసుకుంటే ఇంకా మంచి ఫలితం కనిపిస్తుంది.

# శిశువులకు అన్నం వద్దు



వాషింగ్టన్: ఏడాదిలోపు వయసున్న శిశువులకు అన్నం పెట్టడం మంచిది కాదని అమెరికా శాస్త్రజ్ఞులంటున్నారు. అన్నం తినే పిల్లల మూత్రంలో ఆర్సెనిక్ గాఢత ఎక్కువగా ఉన్నట్లు వారు కనుగొన్నారు. గర్భంలో ఉన్న పిండంపై, శిశువు జన్మించాక తొలినాళ్లలో కూడా రోగనిరోధక శక్తి, నరాల అభివృద్ధిపై ఆర్సెనిక్ వ్యతిరేక ప్రభావం చూపుతుందని గత పరిశోధనలు తేల్చాయి. పాలిష్ పట్టిన బియ్యంలో ఆర్సెనిక్ గాఢత, శిశువులకు ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన 200 నానోగ్రామ్/గ్రామ్ కన్నా ఎక్కువ ఉంటుంది. ఒక ఏడాది వరకు వయసున్న పిల్లలు తినే అన్నం, మూత్రంలో ఆర్సెనిక్ గాఢతల మధ్య సంబంధాన్ని డార్ట్‌మౌత్ కళాశాల పరిశోధకులు పరిశీలించారు.

2011-2014 దాకా న్యూహాంప్‌షైర్‌లో జన్మించిన 759 మంది శిశువులపై అధ్యయనం చేశారు.

# 'అలా అయితే మా పార్టీలోకి రావొద్దు'

పణజి: కాంగ్రెస్, బీజేపీ భార్యాభర్తల్లా వ్యవహరిస్తూ ప్రజలతో ఆడుకుంటున్నాయని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. మిస్టర్-మిసెస్ గా కాంగ్రెస్-బీజేపీ వ్యవహరిస్తున్నాయని ఆక్షేపించారు. పణజిలో ఆమ్ ఆద్మీ పార్టీ వలంటీర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కాంగ్రెస్-బీజేపీ పార్లమెంట్ లోపల మొగుడు-పెళ్లాం మాదిరిగా కొట్టుకుంటున్నాయి. ఈ రెండు పార్టీలకు ఒకరి రహస్యాలు మరొకరికి తెలుసు. గోవాలో కాంగ్రెస్ నేతల అక్రమాలకు సంబంధించిన ఫైళ్లు రక్షణ మంత్రి (మనోహర్ పరీకర్) వద్ద ఉన్నాయని కొంతమంది నాకు చెప్పారు. కాంగ్రెస్ నాయకులకు వ్యతిరేకంగా ఆయన ఎటువంటి చర్యలు తీసుకోరు. వారిని బెదిరించేందుకు ఈ పత్రాలు ఆయన వద్దే ఉంచుకున్నార'ని కేజ్రీవాల్ పేర్కొన్నారు. రెండు పార్టీల మధ్య సంబంధాలు ఉన్నాయని, ప్రజలను వెర్రివాళ్లను చేసి ఆడుకుంటున్నాయని అన్నారు. కాంగ్రెస్-బీజేపీ ప్రజలను దోచుకుంటున్నాయని మండిపడ్డారు. దేశాన్ని చెరో ఐదేళ్లు పాలించాలని ఈ రెండు పార్టీలు అలిఖిత అవగాహనకు వచ్చాయని ఆరోపించారు. టిక్కెట్ల కోసం 'ఆప్'లో చేరవద్దని కేజ్రీవాల్ స్పష్టం చేశారు.

పార్టీలో పనిచేసే వారికి వివిధ బాధ్యతలు అప్పగిస్తామని, టిక్కెట్ల కేటాయింపు కూడా అలాంటిదేనని చెప్పారు. గోవా అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ గెలిస్తే స్థానికుడినే ముఖ్యమంత్రిని చేస్తామని ఆయన ప్రకటించారు. వచ్చే ఏడాది జరగనున్న గోవా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తామని కేజ్రీవాల్ ఇంతకుముందే ప్రకటించారు.




# హెల్తీ ఫుడ్



***కార్యేషు దాసి, కరనేషు మంత్రి, భోజ్యేషు మాత, షయనేషు రంభ అని స్త్రీని పురాణాలు పొగిడాయి. అంతేకాక సహనం అంటే ఏమిటి అని ప్రశ్నించినప్పుడు కనిపించే నిలువెత్తు నిదర్శనం స్త్రీ. కాని ఇన్ని పనులు, ఇన్ని బాధ్యతలూ ఒంటి చేతితో చేసే స్త్రీ పోషకాహార లోపానికి గురవుతోంది. ఇటీవల అధ్యయనాలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. ఓ వైపు సామాజికంగా అసమానతలకు గురయ్యే మహిళలు పోషకాహార విషయంలోనూ వివక్షకు గురవుతున్నారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలలో నెలకొనే సామాజిక జీవన ప్రమాణాలే ఇందుకు నిదర్శనం. చాలామంది మహిళలు పోషకాహార లేమితో బాధపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో పిల్లల్లో ఎదుగుదల లోపం, మహిళలు పోషకాహారలేమితో బాధపడుతన్నట్లు, ఈ సమస్య ముఖ్యంగా ఆసియా దేశాల్లో అధికంగా కనిపిస్తున్నట్లు ఇటీవల ఓ సర్వేలో వెల్లడైంది. గ్రామీణ ప్రాంత ఉమ్మడి కుటుంబాలలో మగపిల్లలు, ఆడపిల్లల ఎదుగుదలలో తీవ్రమైన వ్యత్యాసం ఉన్నట్లు, పోషకాహారం అందించే విషయంలో ఆడపిల్లల పట్ల వివక్ష కొనసాగుతున్నట్లు అధ్యయనంలో వెల్లడైంది.***

ఇళ్లలో ముందుగా మగపిల్లలకు భోజనం పెట్టిన తరువాతే ఆడపిల్లలకు పెట్టే సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది. ఫలితంగా మన దేశంలో మహిళలు, బాలికలు పోషకాహార లేమితో బాధపడుతున్నట్లు వెల్లడైంది. వేళకు తినకపోవటం వల్ల, సరైన పోషకాలు అందక వీరు పలు రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఎత్తు, బరువు తదితర విషయాల్లో సమతుల్యత లోపిస్తున్నట్లు కొలం బియా యూనివర్శిటీ ఆర్థిక శాస్త్రవేత్త అరవింద్ పన్‌గారియా అంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అత్తారింటికి వచ్చే కొత్తకోడళ్లు, వారి పిల్లలు పొట్టిగా ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది. ప్రపంచం మొత్తమీద రక్తహీనతతో బాధపడే మహిళలు మనదేశంలోనే అధికంగా ఉన్నట్లు తాజా అధ్యయనంలో వెల్లడైంది. గ్రామీణ ప్రాంత మహిళలు, బాలికల్లో 60 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు వెల్లడైంది.

రక్తంలో ఇనుము తదితరాల కోసం ఐరన్ మాత్రలు తీసు కునే బదులు ఇనుము ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడమే మంచిది. కానీ, ఇలాంటి నాణ్యమైన పోషకాహా రమే వారికి లభించడం లేదు.

ప్రభుత్వాలు ఆహారభద్రత చట్టం లాంటివి ఎన్ని తెచ్చినా ప్రయోజనం అంతంత మాత్రమే. పోషకాలు ఉండే ఆహార పదార్థాలన్నీ కాస్త ఖరీదు ఎక్కువగానే ఉంటున్నాయి. అందుకే ధర తక్కువగా ఉండే చిరుధాన్యాలు తదితర ఆహార పదార్థా లను తీసుకుంటే ఎంతో మంచిది.

సుమారు యాభై ఏళ్ల క్రితం గ్రామీణ ప్రాంతాలలో సామా న్య, మధ్యతరగతి కుటుంబాలలో చిన్నా, పెద్ద మొదలు అంద రూ జొన్న,సజ్జలు,రాగులు లాంటి తృణధాన్యాలను ఆహారం గా తీసుకునేవారు. వీరు కఠినమైన పనులు అధికంగా చేసే వారు కాబట్టి ధృడంగా, ఆరోగ్యంగా ఉండేవారు. రానురానూ జీవనశైలిలో వచ్చిన మార్పులతో పాటు ఆర్థికలేమి వారిని చౌకగా లభించే పోషకాహారం నుంచి దూరం చేస్తోంది. ఒకే కు టుంబంలో ఉండే ఆడ, మగపిల్లల శారీరక ఎదుగుదలను గనుక పరిశీలిస్తే ఎంతోవ్యత్యాసం కనిపిస్తోంది. కనీసం గంట సేపు కూడా పరుగెత్తలేని పరిస్థితిలో గ్రామీణ ప్రాంత పిల్లలు ఉన్నారు. ఎత్తు, లావు, చురుకుదనం తదితర విషయాల్లో విప రీతమైన తేడా ఉంటోంది. అలాగే, పిల్లల్లో శారీరక సామర్థ్యం కూడా చాలా తక్కువ ఉన్నట్లు వెల్లడైంది. టీవీలకు, ఇంటర్నెట్ గేమ్స్‌కు అతుక్కుపోతూ చిన్నారులు నిర్లక్ష్యం చేస్తున్నారు.క్రీడ లతో శారీరక,మానసికఎదుగుదల ఎక్కువగాఉంటుంది. చిన్న తనంలో ఆటలవల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. ఆటల వల్ల నాడీ వ్యవస్థ ఉత్తేజితమవుతుంది. ఫలితంగా పిల్లల్లో ఎదుగు దల ఉంటుంది. కానీ,దురదృష్టవశాత్తూ పేదరికం పిల్లలకు పెను శాపంగా మారి వారి ఎదుగుదలను కుంగదీస్తోంది. వాస్త వానికి మగపిల్లల్లో ఎదుగుదల జీవితంలో మూడుసార్లు జరు గుతుంది.ఆ సమయంలో సరైన పోషకాహారం తీసుకుంటే వా రుఎత్తుపెరుగు తారనిప్రిన్స్‌యూనివర్శిటీ ప్రొఫెసర్‌అంగ్స్ డీట న్‌అంటు న్నారు. సరైనపోషకా హారంతీసుకోకపోతేఎన్నో పెరుగు దలలోపాలు ఏర్పడిరానురానూ మరిన్నిఇబ్బందులుతలెత్తే పరి స్తితిఉంది. కాబట్టిసరైన పోషకాహారంతీసుకోవట ం మంచిది.


కాకర, పండ్లు , కాయగూరలు, గింజలు, పప్పులు, కంద మూలాలు, సుగంధద్రవ్యాలు మానవుడికి ప్రకృతి ప్రసాదిం చిన అపురూపమైన వరము .ఆయా సీజన్లలో పండే పండ్లను ఆరగించడం మనకు తరతరాలుగా తెలుసు. అన్నంతో కూడా ప్రకృతిసిద్ధమైన పండ్లు, కూరగాయలు ఇతర త్రునధన్యాలను ఆహారంగా ఆహారముగా తీసుకుని జీవించినట్లయితే శరీరాని కి కావససినఅ న్నిరకాలపోషకాలు లభిస్తాయి. ఇదేఅసలు ఉత్త మమైన జీవన విధానమని పకృతి వైద్యుల నమ్మకం. కాకర ఇండియా అంతా పెంచబడుతున్న ఓ చేదు తీగ జాతి మొక్క. దీని శాస్త్రీయ నామం మొమోర్డికా కరన్షియా. ఇది కుకుర్బిటేసి కుటుంబానికి చెందినది. ఆరోగ్యాన్ని ఇచ్చే కాకర చేదు అయి నప్పటికీమధుమేహానికి మందుగావాడుతున్నారు.కాయ, కాక ర రసం,కాకరఆకులు మందుగా ఉపయోగపడతాయి. కాకర రసంలో హైపోగ్లసమిక్ పదార్థము ఇన్‌సులిన్ స్థాయిలో తేడా రాకుండా నియంత్రణ చేస్తూ రక్తంలోని చెక్కెర స్థాయిని అదు పులో ఉంచుతుంది. కాకర గింజలల లో రక్తంలో గ్లూకోజ్‌ను తగ్గించే చారన్‌టిన్‌అనే ఇన్సులిన్ వంటి పదార్థం ఉంటుంది . తమిళము: పావక్కాయ్, కన్నడము: హాగల్ కాయి, మళ యాలము: కప్పాక్కా, ఓంఢ్రము: కరవిలా, హిందీ: కర్లీ, కరేలా, సంస్కృతము: కారవేల్ల. కాకర రకాలు నల్ల కాకర, తెల్ల కాకర, బారామాసి, పొట్టికాకర, బోడ కాకర కాయ అని మరొక గుండ్రని కాయ. ఇది కూడా చేదుగానే ఉంటుంది. కాకరకాయలు కొంచెం చేదుగా ఉన్ననూ ఉడికించినా, పులుసును పెట్టినా, బెల్లమును పెట్టి కూరగా చేసినా మంచి రుచికరంగా ఉంటుంది. కొద్దిగా చేదు భరించువారు దీనిని ముక్కలుగా చేసి తినుడం చేయవచ్చు. దీనిలో నీరు తక్కువ పౌష్టిక శక్తి ఎక్కువ.

**వైద్యమున ఉపయోగాలు:**

దీనిని తింటే కొంతమందికి వేడి చేస్తుంది. అటువంటి వారికి దీనిని మజ్జిగలో ఉడికించి ఇవ్వా లి. తద్వారాచేదు కూడాతగ్గుతుంది. కాకరాకురసమును కుక్క, నక్క మొదలగు వాటి కాటునకు విరుగుడుగా వాడతారు. కొం దరు ఈ ఆకు రసమును గాయాలపై రాస్తారు. మరికొందరు దీనిని చర్మ వ్యాధులకు, క్రిమిరోగాలకూ వాడతారు. కాకర కా య అనగానే ఒక్క మధుమేహ వ్యాధిగ్రస్తులకే మంచి ది అను కోకండి. ఔషధగుణాలున్న కాకరనుతరచూ తీసుకోవడం వల్ల రక్త శుద్ధి జరుగుతుంది. హైపర్‌టెన్షన్‌ని అదుపులో ఉంచుతుది. ఫాస్ఫరస్, అధిక మొత్తంలో పీచు లభిస్తుంది. సోరియాసి స్‌ను నివారణలో కాకరకీలకపాత్రపోషిస్తుంది. శరీరానికి అత్యా వ శ్యక పోషకాలైన ఫొలేట్, మెగ్నీషియం, పొటాషియం, జింక్ కూడా సమృద్ధిగా లభిస్తాయి. జీర్ణ శక్తిని వృద్ధి చేస్తుంది.

చేదు గా ఉన్నందున పొట్టపురుగు నివారణకు ఉపయోగపడును. దీనిలో ఉన్న మోమొకార్డిసిన్ యాంటి వె%రస్‌గా ఉపయోగప డుతుంది. ఇమ్యునో మోడ్యులేటర్‌గా పనిచేయడం వల్ల కాన్స ర్, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు మంచిది.

# ఈ అవగాహన అత్యవసరమే..!



మీరు మిత్రుడితో కలిసి మాట్లాడుకుంటూ రోడ్డుమీద నడుస్తున్నారు. అకస్మాత్తుగా అతడు స్పృహ తప్పాడు... ఏం చెయ్యాలి? ఇంట్లో ఒక్కసారిగా తాతయ్య మాటల్లో తడబాటు కనిపించింది... ఎందుకని? ఆ మార్పు ప్రమాదకరమా? రోడ్డు మీద వెళు తున్నప్పుడు అకస్మాత్తుగా ఒకరు ఫిట్స్‌తో పడిపోయారు... మనం ఏదైనా సాయం చెయ్యగలమా? ఎప్పుడూ లేనిది కడుపు పై భాగంలో నొప్పి అసిడిటి కావచ్చని అనుకుంటాము... అది నిజంగా అసిడిటినే అయి ఉంటుందా..? లేక మరేదైనా ప్రమాదకరక స్థితి కాదు కదా? ఇలాంటి వన్నీ ఒక్కోసారి అత్యవసర పరిస్థితులకు దారి తియ్యవచ్చు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితులను గుర్తించడం.., సమయానికి స్పందించడం... గురించిన వివరాలు అత్యవసర పరిస్థితి చెప్పి రాదు; అది ఎప్పుడైనా ఎదురు కావచ్చు. ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఎవరికైనా ఏర్పడనూ వచ్చు. అలాంటి స్థితిని ఎదుర్కోవడానికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉండాలి. అది మనతో ఉన్న వారు అకస్మాత్తుగా స్పృహ తప్పటం, ఎవరికైనా షాక్ కొట్టడం, ఎవరైనా పై నుంచి కింద పడిపోవడం, ఎప్పుడూ లేని విధంగా కడుపులో నొప్పి రావడం, ఇంట్లో ఎవరికైనా స్ట్రోక్ రావడం, రోడ్డు మీద ఎవరికైనా ఫిట్స్ రావడం ఇలా అత్యవసర స్థితి ఎప్పుడైనా ఏరూపంలోనైనా ఎదురు కావచ్చు. అత్యవసర పరిస్థితి ఏర్పడినపుడు ఎలా స్పందించాలనే విషయాల గురించి తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలి.

**స్పృహ తప్పితే...**

అనుకోకుండా మన వెంట ఉన్న వారు స్పృహ తప్పి పడిపోతే ముందుగా మనకు చాలా కంగారు కలుగుతుంది. ఏం చెయ్యాలో తోచదు. అయ్యో...అయ్యో... అనడం మినహా వెంటనే కర్తవ్యం బోధపడదు. అయితే స్పృహ తప్పిన వారిని ప్రమాదం నుంచి బయట పడెయ్యాలంటే అన్నింటికంటే ముందుగా మనం అలా కంగారు పడకుండా ఉండడం అవసరం. ఒకవేళ కంగారు పడినా వెంటనే సర్దుకోవాలి. పడిపోయిన వారిని గట్టిగా కుదిపి లేపి చూడాలి. గట్టిగా వారి పేరు పెట్టి పిలవాలి. ఒకవేళ వారు స్పందించగలిగితే అది ఒకింత మేలైన స్థితిగా భావించవచ్చు. ఎలాంటి స్పందన లేకపోయినట్టయితే సాయం కోసం ఎవరినైనా అభ్యర్థించడం మంచిది.

గొంతు కింద చెయ్యి పెట్టి అక్కడ కొట్టుకునే నాడిని పరీక్షించి చూడాలి. ఇక్కడ కొట్టుకునే నాడిని కెరొటెడ్ పల్స్ అంటారు. అక్కడి నాడీ స్పందన కనిపించకపోతే వెంటనే కార్డియోపల్మనరీ రీసజిటేషన్(సీపీఆర్) అనే ప్రథమ చికిత్స చెయ్యాలి. ఇందులో భాగంగా ఒకచేతి మీద మరో చేతిని ఉంచి బాధితుడి ఛాతి మధ్య భాగంలో బలంగా ఒత్తిడి కలిగించాలి. ఈ ఒత్తిడి ఎంత బలంగా ఉండాలంటే లోపలికి ఛాతిని ఒత్తినపుడు అది దాదాపు రెండు అంగుళాల మేర లోపలికి వెళ్లాలి. అలా 30 సార్లు ఒత్తిడి కలిగించిన తర్వాత బాధితుడి ముక్కు మూసేసి నోటిని నోటితో మూసేసి బలంగా రెండు సార్లు ఊపిరి తిత్తులలలోకి గాలి ఊదాలి. ఇలా వంద సార్ల వరకు ఒత్తిడి కలిగించాలి. గాలి ఊదాలి. ఇది 30:2 నిష్పత్తిలో ఉండాలి. అంటే 30 సార్లు ఒత్తిడి కలిగించి 2 సార్లు గాలి ఊదాలి. ఇలా 5 నిమిషాలు చేసి తిరిగి సీపీఆర్ కొనసాగించాలి. నాడి తిరిగి కొట్టుకోవడం మొదలు పెట్టే వరకు ఈ చికిత్స కొనసాగించాలి.

ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫ్యూజర్ ఉపయోగిం చవచ్చు. ఇది ఆ సమయంలో షాక్ అవసరమా కాదా అనేది కూడా నిర్ణయిస్తుంది. దీనిలో మూడు బటన్స్ ఉంటాయి. మొదటిది ప్యాడ్స్‌ను బాధితులకు అమర్చడానికి, రెండోది హృదయస్పందనను విశ్లేషించడానికి, మూడోది షాక్ అవసరమా కాదా నిర్ణయించడానికి ఉపయోగపడతాయి. దీనిని ఎవరైనా ఉపయోగించవచ్చు. నిజానికి ఇది అన్ని పబ్లిక్ ప్లేస్‌లలో అందుబాటులో ఉండాలి. **మూర్ఛ** మూర్ఛతో బాధపడేవారిని చూసినపుడు చాలా భయం కలుగుతుంది. ఎలా స్పందించాలో కూడా అర్థం కాదు. అందరూ ఒకరకమైన ఆందోళనతో చుట్టూ చేరతారు. కొంత మంది కాస్త ధైర్యం చేసి వారి చేతికి ఏ ఇనుప వస్తువునో, తాళం చేతుల గుత్తినో అందించేందుకు ప్రయత్నం చేస్తారు. అయితే దీనితో పెద్దగా ప్రయోజనం లేదనేది నిపుణుల మాట. ఎవరికైనా మూర్ఛ వచ్చినపుడు కొన్ని ప్రత్యేకమైన జాగ్రత్తలు పాటించడం వల్ల రోగికి కొంత ఉపశమనం కలిగించిన వారిమవుతాము.

-మూర్ఛ వచ్చిన వారి చుట్టూ గుంపు కట్ట కూడదు.

-వారిని ఒడిసి పట్టుకునే ప్రయత్నం కూడా చెయ్యొద్దు, దగ్గరలో ఏవైనా గాయపరిచే వస్తువులు ఉంటే వాటిని దూరంగా తీసేస్తే చాలు

-మూర్ఛ నుంచి బయటపడిన వెంటనే తినడానికి ఏమీ ఇవ్వ కూడదు -ఒక వైపుగా తిప్పి పడుకోబెట్టడం వల్ల మూర్ఛ సమయంలో వారి నోట్లోకి వచ్చిన లాలాజలం వంటి స్రావాలు ఊపిరితిత్తుల్లో చేరకుండా నివారించవచ్చు. అది ఎడమ వైపు తిప్పి పడుకోబెడితే మరీ మంచిది.

# ముఖం మీద సన్నని వెంట్రుకలను తొలగించే ఎగ్ వైట్

*చర్మ సంరక్షణ కోసం ఇంట్లో తీసుకొనే జాగ్రత్తలతో చాలా ప్రయోజనాలున్నాయి. సాధారణంగా తీసుకొనే ఆహార పానీయాలు ఆరోగ్యంగా ఉండేందుకు, చర్మ సంరక్షణకు సహకరిస్తుంది. ముఖంలో మొటిమలు రాకుండా కాపాడుతుంది. అయితే చర్మ సంరక్షణకు ఒక్క ఆహార పానీయాలతోటే సరిపోదు. ఆహార పానీయాలతోపాటు మరి కొన్ని ఇంటి చిట్కాలను కూడా పాటించినట్లైతే చర్మాన్ని మరింత మెరుగుపరచుకొని ఎప్పుడూ ఫ్రెష్‌గా కనపడ వచ్చు. అలాగే ముఖచర్మం కాంతివంతంగా కనబడే సమ యంలో ఏదో ఒక చిన్న లోపం తెలుస్తూనే ఉంటుంది. మొటిమలు లేకపోయినా దానికి సంబంధించిన నల్లమ చ్చలు, ముఖ చర్మం నల్లగా ఉండటం, లేదా ముఖం తెల్లగా ఉన్నా ముఖం మీద సన్నని వెంట్రుకలు కనిపిస్తూ అంద విహీనంగా కనబడుతుంటాయి. మరి ఈ చిన్న చిన్న లోపాలను ఎలా సరిదిద్దుకోవాలో ముఖాన్ని ఎలా సున్నితంగా ఉండేట్లు చేయాలో చూద్దాం. ముఖం సున్నితంగా.. కాంతివంతంగా, చర్మాన్ని బిగుతుగా ఉంచేందుకు గుడ్డు బాగా పనిచేస్తుంది. ఒక్కసారి గుడ్డును చర్మ సంరక్షణలో ఉపయోగించి, ఫలితమేంటో చూడండి. మరి గుడ్డును ఏవిధంగా ఉపయోగించాలో చూద్దాం. గుడ్డు తెల్లని సొనలో న్యూట్రియట్స్ అధికంగా కలిగి ఉండడంవల్ల చర్మం మెరుస్తుండేలా చేస్తుంది. గుడ్డుతో ఫేస్ ప్యాక్ ఎలా? ఒక మిక్సింగ్ బౌల్ తీసుకుని అందులో గుడ్డులోని తెల్లసొన ఒక చెంచా, ఆలివ్ ఆయిల్ ఒక చెంచా, నిమ్మ రసం ఒక చెంచా వేసి బాగా మిక్స్‌చేసి ముఖానికి, గడ్డం క్రింద, మొత్తం మెడ మీద అప్లై చేయాలి. అరగంట పాటు అలాగే వదిలేస్తే చర్మం బిగుసుకుంటుంది. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. అంతే చర్మం తాజాగా ఉండటమే కాక, బిగుతుగా ఫ్రెష్‌గా కనబడు తుంది. ఈ ఫేస్ ప్యాక్ సాధారణ చర్మతత్వం కలవారి నుండి పొడి చర్మం వారికి కూడా అద్భుతంగా పనిచేస్తుంది. గుడ్డు సొనతో మరో అద్భుతమైన మార్పును తీసుకొచ్చే స్వభావం కలిగి ఉంది. అందమైన ముఖంలో చెవుల దగ్గర, చెంపలమీద, చిన్న గడ్డం మీద కంటికి కనిపించి, కనిపించని వెంట్రుకలు ఉంటాయి. అటువంటి వాటిని పూర్తిగా తొలగిస్తుంది. అందుకోసం ఒక మిక్సింగ్ బౌల్‌లో గుడ్డులోని తెల్లని సొన తీసుకొని,*

*ఒక చెంచా పంచదార, అర చెంచా మొక్కజొన్న పిండి కలిపి బాగా మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖంలో ఎక్కడెక్కడ సన్న వెంట్రుకలు ఉన్నాయో ఆ ప్రదేశంలో అప్లై చేసి అరగంట తర్వాత స్క్రబ్ చేసి తొలగించి ముఖాన్ని శుభ్రపరచుకుంటే అద్భుతమైన మార్పు కనిపిస్తుంది. దాంతో పాటు ముఖం సున్నితంగా, మృదువుగా కనిపిస్తుంది. ముఖం ప్రకాశవంతంగా కనబడేం దుకు ఇది ఒక ఎవర్ గ్రీన్ బ్యూటీ టిప్.*

# చిత్రభాను

## వరుస సినిమాలతో విక్రమ్ బిజీబిజీ

ప్రముఖ తమిళ కథానాయకుడు విక్రమ్ ఈ ఏడాది వరుస సినిమాలతో బిజీగా గడుపుతున్నారు. వెండితెరపై ఎప్పుడూ ప్రయోగాత్మక చిత్రాలతో కొత్తదనం పంచేందుకు పరితపించే ఆయన ఒక్కోసినిమాకు చాలా సమయం వెచ్చిస్తుంటారు. అయితే ఈ ఏడాది ఆయన మూడు చిత్రాల్లో నటిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు గౌతమ్ మేనన్ దర్శకత్వంలో రూపొందుతున్న ధ్రువనక్షత్రమ్ షుటింగ్‌లో పాల్గొన్న విక్రమ్ కొద్ది కాలం ఆ చిత్రానికి విరామం ఇచ్చారు. అనంతరం విజయ చందర్ తెరకెక్కిస్తోన్న స్కెచ్‌కు పూర్తి సమయం కేటాయించారు. ఇటీవలే ఈ చిత్రం టాకీ పూర్తై%ంది. ఈ చిత్రంలో తమన్నా కథనాయికగా నటిస్తోంది.

తాజాగా విక్రమ్ మళ్లీ ధ్రువనక్షత్రమ్ సెట్‌లో అడుగుపెట్టినట్లు సమాచారం. గురువారం నుంచి ఈ చిత్రం షుటింగ్‌లో ఆయన పాల్గొంటున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం ట్రిప్లికేన్‌లో ప్రస్తుతం చిత్రీకరణ సాగుతున్నట్లు తెలుస్తోంది.

ఈ సినిమా చిత్రీకరణ పూర్తై%న అనంతరం విక్రమ్ తన తదుపరి చిత్రం సామి 2 షుటింగ్‌లో పాల్గొంటారు. హరి దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ చిత్రంలో త్రిష, కీర్తి సురేశ్ కథానాయికలు. ప్రభు, దిల్లీ గణేశ్, సూరి కీలక పాత్రల్లో కన్పించనున్నారు. హరీశ్ జైరాజ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం షుటింగ్ సెప్టెంబర్ 15న లాంఛనంగా ఆరంభం కాబోతోంది.




## ప్రభాస్ మొదలు పెట్టాడు!

ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన బాహుబలి ది కన్‌క్లూజన్ తరువాత ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రం సాహో. యువ దర్శకుడు సుజిత్ రూపొందిస్తున్నారు. యు.వి.క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షుటింగ్ ఈ శుక్రవారం మొదలైంది. ఈ విషయాన్ని హీరో ప్రభాస్ సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఇట్స్ షుట్ టైమ్...దాదాపు నాలుగున్నరేళ్ల బాహుబలి ప్రయాణం తరువాత సాహో అనే కొత్త యాక్షన్ ప్రపంచంలోకి ప్రవేశించడం చాలా ఎక్సైటింగ్‌గా వుంది అని పోస్ట్ చేశారు. ప్రస్తుతం చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతున్నట్లు తెలిసింది. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కానున్న ఈ చిత్రంలో ప్రభాస్‌కు జోడీగా శ్రద్ధాకపూర్‌ను ఖరారు చేశారు. అంతర్జాతీయ స్థాయి సాంకేతిక పరిజ్ఞానంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రభాస్ మరింత స్టైలిష్‌గా కనిపించనున్న ఈ చిత్రం కోసం విదేశాల్లో పోరాట ఘట్టాలు చిత్రీకరించనున్నారట. ఇందు కోసం హాలీవుడ్ స్టంట్‌మెన్ కెనీ బేట్ పనిచేస్తున్నారు. యూరప్‌తో పాటు అబుదాబి, రుమేనియా తదితర దేశాల్లో కీలక ఘట్టాల చిత్రీకరణ జరపనున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురాన్నట్లు తెలిసింది.



## నాని డేట్ ఫిక్స్ చేశాడు!




వరుస విజయాలతో దూసుకుపోతున్న కథానాయకుడు నాని. తన తొలి తెలుగు చిత్రం ఫిదాతో ప్రేక్షకుల్ని కట్టిపడేసిన ముద్దుగుమ్మ సాయిపల్లవి. వీరిద్దరూ కలిసి నటిస్తున్న చిత్రం ఎం.సి.ఎ.మిడిల్ క్లాస్ అబ్బాయి అనేది ఉపశీర్షిక. డబ్బింగ్‌తో ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రారంభించినట్లు నాని ఫేస్‌బుక్ ద్వారా తెలిపారు. డిసెంబరు 21న థియేటర్లో కలుద్దామంటూ విడుదల తేదీని ప్రకటించారు.

వేణు శ్రీరామ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ బాణీలు అందిస్తున్నారు. నిన్ను కోరి హిట్ అనంతరం నాని నటిస్తున్న చిత్రమిది.

దీని తర్వాత ఆయన కృష్ణార్జున యుద్ధంలో నటించనున్నారు. ఇందులో ఆయన ద్విపాత్రాభినయం చేయనున్నట్లు తెలుస్తోంది.

## ఇడియట్‌లాంటి జూలియట్

అతను అపర ప్రేమికుడు. ప్రేమ కోసం, ప్రేమించిన అమ్మాయి కోసం ఏమైనా చేస్తాడు, ఎంత దూరమైనా వెళ్తాడు. ప్రేమంటే ఇలా ఉండాలి, ప్రేమికుడు అంటే ఇతనిలా ఉండాలి అనుకొంటుంటారు అంతా. కాకపోతే తనకు కాస్త తిక్క! అప్పుడప్పుడూ దురుసుగా ప్రవర్తిస్తుంటాడు. కోపం ఎక్కువ. అయితే ఇదంతా ప్రేమ కోసమే అంటుంటాడు. ఇంతకీ అతగాడి ప్రేమకథేంటో తెలియాలంటే మా సినిమా చూడాల్సిందే అంటున్నారు నవీన్ చంద్ర. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం జూలియట్ లవర్ ఆఫ్ ఇడియట్. నివేదా థామస్ కథానాయిక. అజయ్ వోధిరాల దర్శకుడు. కొత్తపల్లి ఆర్.రఘుబాబు, కె.బి.చౌదరి నిర్మాతలు. హైదరాబాద్‌లో టీజర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా నవీన్ చంద్ర మాట్లాడుతూ టైటిల్‌కి తగ్గ క్యారెక్టరైజేషన్ నాది. కథానాయకుడి పాత్రే చాలా కొత్తగా ఉంటుంది. ప్రతీ ప్రేమికుడూ ఓ దశలో ఇడియట్‌లానే కనిపిస్తాడు. అలానే ప్రవర్తిస్తాడు. అలాంటి కుర్రాడి కథే ఇది. నివేదా చాలా బాగా నటించిందన్నారు. కథ అనుకొన్నప్పుడే... ఈ పాత్రలో నవీన్ చంద్రనే బాగుంటాడు అనిపించింది.

ఆపాత్రలో ఇమిడిపోయాడు. నవీన్ - నివేదాల కెమిస్ట్రీ ఆకట్టుకొంటుందన్నారు నిర్మాతలు. సరికొత్త కోణంలో సాగే ప్రేమకథ ఇది. జూలియట్ లాంటి అమ్మాయి ఓ ఇడియట్‌ని ప్రేమిస్తే ఎలా ఉంటుందో వినోదాత్మకంగా చూపించాం. సినిమా పూర్తయింది. కొంతమందికి చూపించాం. చాలా బాగుంది అని మెచ్చుకొన్నారు. ప్రేక్షకుల నుంచి కూడా ఇలాంటి ప్రతిస్పందనే వస్తుందన్న నమ్మకం ఉందన్నారు దర్శకుడు.





## ప్రేమకు ధన్యుణ్ణి!

సోషల్‌మీడియాలో చురుగ్గా వుంటారు నాగార్జున. సినిమా విశేషాలతో పాటు తన వ్యక్తిగత విషయాల్ని కూడా అభిమానులతో పంచుకుంటారు. సాంఘిక మాధ్యమాల్లో ఆయన్ని అనుసరిస్తున్న వారు లక్షల్లో వున్నారు. తాజాగా ఈ వెండితెర మన్మథుడు సోషల్‌మీడియాలో సరికొత్త మైలురాయిని చేరుకున్నారు. ట్విట్టర్‌లో నాగార్జున ఫాలోవర్స్ సంఖ్య 30 లక్షలకు చేరింది. ఈ సందర్భంగా ఆయన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. నాపై చూపిస్తున్న అపారమైన ప్రేమకు ధన్యుణ్ణి అంటూ ఆయన ట్విట్టర్‌లో స్పందించారు. ట్విట్టర్‌లో నాగార్జునని ప్రతిరోజు ఐదువేల మంది కొత్తగా ఫాలో అవుతున్నారు. ఇదిలావుండగా నాగార్జున ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం రాజుగారి గది-2 ప్రస్తుతం చిత్రీకరణ దశలో వున్నది. ఓంకార్ దర్శకుడు. అక్టోబర్ 13న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## ప్రచారం హోరెత్తించింది....

సెట్‌కి వెళ్లి నటించామా, వచ్చామా అన్నట్టుగానే వ్యవహరిస్తుంటారు స్టార్ కథానాయికలు. ఇక మిగతా విషయాలతో తమకేం సంబంధమే లేదన్నట్టుగా ఉంటుంది వాళ్ల తీరు. కాల్‌షీట్లు ఇచ్చేటప్పుడే సవాలక్ష కండిషన్లు పెడుతుంటారు. అందులో ఏ ఒక్క విషయంలో లోటు జరిగినా ఇక నిర్మాత పరిస్థితి అంతే. అందుకే కథానాయిక నటించి వెళితే చాలు, అదే పదివేలు అంటూ వాళ్లతో పనిచేయించుకొంటుంటారు దర్శకనిర్మాతలు. అందరూ ఇంతే అని కాదు కానీ, స్టార్ కథానాయికల్లో చాలామంది ఇలాగే వ్యవహరిస్తుంటారు. ప్రచార కార్యక్రమాలతో సంబంధం లేదని కాల్‌షీట్లు ఇచ్చేటప్పుడే ఒప్పందం చేసుకొనే కథానాయికలు కొంతమందైతే, ప్రచార కార్యక్రమాల్లో కూడా పాల్గొనాలంటే అందుకు అదనంగా పారితోషికం ముట్టజెప్పాల్సి ఉంటుందనేవాళ్లు మరికొంతమంది. ఆయా తారలకి ఆ స్థాయి డిమాండ్ ఉండటంతో నిర్మాతలు కూడా కాదనకుండా, వాళ్లు చెప్పినట్టే చేస్తుంటారు. నయనతార అయితే సినిమాల్లో నటించడం తప్పితే, ప్రచార కార్యక్రమాల్లో అస్సలు పాల్గొనదు. ముందుగానే ఖరాకండీగా చెప్పేస్తుందామె. అయితే కాజల్ మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఇటీవల నేనే రాజు నేనే మంత్రి సినిమాని తన భుజాలపై వేసుకొని ప్రచారం చేసింది. తెలుగుతో పాటు, తమిళంలోనూ ఆ చిత్రం విడుదలైంది. రెండు భాషల్లోనూ కాజల్ ఆ సినిమా ప్రచార కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంది. తన తొలి చిత్ర దర్శకుడు తేజ తీసిన చిత్రమనే అంతగా ఆమె ప్రచార కార్యక్రమాల్లో పాల్గొందా లేదంటే, చిత్రబృందం ఆమెతో ఒప్పందం కుదుర్చుకొందా అనేది ఆసక్తికరంగా మారింది. సినిమాలో కాజల్ పోషించిన రాధ పాత్రకి మంచి స్పందన లభిస్తోంది.



## విశాఖవాసుల ఆదరణతోనే

# మా వ్యాపారాభివృద్ధి

- మొబైల్ వ్యాపారంలో సెల్‌పాయింట్ ఒక బ్రాండ్
- 2019 నాటికి ఓన్ బ్రాండ్‌లో మొబైల్ తయారీయే లక్ష్యం
- సెల్‌పాయింట్ 69వ శాఖను ప్రారంభించిన సినీ హీరోయిన్ సురభి
- అందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు

సెల్‌పాయింట్ ఎండీ మోహన్ ప్రసాద్ పాండే



*నేటి యాంత్రిక యుగంలో ప్రతీ ఒక్కరికీ సెల్ ఫోన్ ఒక ముఖ్య వస్తువుగా పరిగణించబడుతోంది. శాస్త్ర సాంకేతిక పరంగా సమాచార ప్రచారంలో మొబైల్ పాత్ర కీలకంగా మారింది. ఇందులో భాగంగా ప్రతీ ఒక్కరికీ అందుబాటు ధరలలో, సామాన్యులకు సైతం ఉన్నత విలువలు కలిగిన సెల్‌ఫోన్‌ను అందించాలనే లక్ష్యంతో విశాఖ మహానగరంలో 2001లో స్థానిక డైమండ్ పార్క్ ఏరియాలో చిన్న శాఖగా ప్రారంభమైన సెల్ పాయింట్ మొబైల్ ప్రియుల మనస్సులు దోచుకుందని అనడంలో సందేహం లేదు. ఇదే ఉత్సాహంతో మొబైల్ కస్టమర్లకు ఉత్తమ సేవలు అందిస్తూ అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్రంలోని నలుమూలల వ్యాపిస్తూ ఇప్పటి వరకు 69 శాఖలను ప్రారంభించడం అభినందనీయం.*

సీతమ్మధార: మొబైల్ వ్యాపార రంగంలో తనదైన ముద్రను వేసుకుని కస్టమర్ల ఆదరాభిమానాలు చూరగొన్న సెల్‌పాయింట్ 69వ శాఖగా విశాఖ నగరంలో సీతమ్మ ధార, అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లలో శనివారం ప్రముఖ సినీ హీరోయిన్ సురభి (జంటిల్‌మేన్ ఫేం) చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించడం జరిగింది. ఇందులో భాగంగా హీరోయిన్ సురభి, సెల్ పాయింట్ సంస్థల అధినేత మోహన్ ప్రసాద్ పాండే, డైరెక్టర్ బాలాజీ ప్రసాద్ పాండే సెల్‌పాయింట్ యొక్క సేవలను హీరోయిన్ సురభికి వివరించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి షోరూంలో ఉన్న పలు కంపెనీల మొబైల్స్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సెల్ పాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మోహన్ ప్రసాద్ పాండే మాట్లాడుతూ ముందుగా అందరికీ వినాయక చవితి శుభాకాంక్షలను తెలియజేశారు. మొబైల్ వ్యాపార రంగంలో విశాఖ నగరంతో పాటు రాష్ట్రం నలుమూలల ఇప్పటి వరకు 69 బ్రాంచీలను ప్రారంభించడం జరిగిందని ఇంతటి వ్యాపారాభివృద్ధికి కారకులైన ప్రతీ ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలను తెలియజేశారు. కస్టమర్లకు విలువలతో కూడిన సర్వీసును అందజేయడం, కస్టమర్ల శ్రేయస్సే మా వ్యాపార రహస్యం అన్నారు. విశాఖలో మొబైల్ వ్యాపారంలో సెల్ పాయింట్ ఒక బ్రాండ్ అని అన్నారు. 2019 నాటికి తమ సొంత బ్రాండ్‌లు మొబైళ్లను తయారు చేసి మార్కెట్‌లో ప్రవేశించాలనేది మా యొక్క లక్ష్యమని అన్నారు. ఒంగోలు కేంద్రంగా ఈ నెల 23వ తేదీన నూతన బ్రాంచిని ప్రారంభించడం జరుగుతోందని మేనేజింగ్ డైరెక్టర్ మోహన్ ప్రసాద్ పాండే తెలియజేశారు.


ఈ కార్యక్రమంలో సినీ నటి సురభి మాట్లాడుతూ కస్టమర్లకు విలువలనిచ్చి ప్రతీ ఒక్కరికీ అందుబాటు ధరలలో మొబైళ్లను అందిస్తున్న సెల్ పాయింట్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. విశాఖ నగరమంటే తనకెంతో ఇష్టమని, అందమైన, ఆహ్లాదకరమైన సాగరతీరం సీతమ్మధారలో సెల్‌పాయింట్ సంస్థ తమ నూతన బ్రాంచి ప్రారంభోత్సవానికి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మున్ముందు సెల్‌పాయింట్ మరిన్ని బ్రాంచీలు ప్రారంభించాలని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో సెల్‌పాయింట్ సంస్థల ఎఎస్ఎం వెంకటేశ్వర రావు, గోవిందు, హెంబ్రీ (చంటి), పాడేరు డిఎఫ్ఓ , సాక్షి రీజనల్ మేనేజర్ (అడ్వర్టయిజింగ్) అరుణ్ కుమార్, సాక్షి సీనియర్ ఆఫీసర్ (అడ్వర్టయిజింగ్) నిమ్మల వెంకటగోపాలకృష్ణ (గోపాల్) మరియు సెల్‌పాయింట్ సిబ్బంది పాల్గొన్నారు.






## 23న జనసైన్యం ఎంపిక శిబిరం




హైదరాబాద్: రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనాలనే ఆకాంక్ష ఉన్న మేధావులు, యువత కోసం జనసేన నిర్వహిస్తున్న ఔత్సాహికుల వేదికలను నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో నిర్వహించనున్నట్టు ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే ఎనిమిది ఉమ్మడి జిల్లాల్లో ఈ ప్రక్రియ పూర్తయిందని ఆయన ఓ ప్రకటన జారీచేశారు. స్పీకర్లు, ఎనలిస్ట్‌లు, కంటెంట్ రైటర్ విభాగాల్లో పాల్గొని ఈ శిబిరాలను విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు చెప్పారు. ప్రస్తుతం నిర్వహించనున్న ఈ రెండు జిల్లాలతో ఈ ప్రక్రియ తెలంగాణలో పూర్తవుతుందన్నారు.

ఈ నెల 23న నిజామాబాద్‌లో, సెప్టెంబర్ 7న ఖమ్మంలో ఈ శిబిరాలు నిర్వహించనున్నట్టు పవన్ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారందరికీ ఈ-మెయిల్, ఎస్ఎంఎస్‌ల ద్వారా శిబిరం వివరాలు, సమయాన్ని జనసేన ప్రతినిధులు తెలియజేస్తారని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయలేకపోయినవారు శిబిరం వద్దకు వచ్చి తమ పేర్లు నమోదు చేసుకోవాలని పవన్ సూచించారు.

## భారత తొలి ప్రయోగవేదిక

### దంబుల్లా వన్డేకు టీమిండియా సిద్ధం




దంబుల్లా: మూడు టెస్టుల సిరీస్‌లో శ్రీలంకను 3-0తో వూడ్చేసిన టీమిండియా వన్డే సిరీస్‌కు సిద్ధమైంది. అంతర్జాతీయ వన్డేల్లో అరంగేట్రం చేసిన దంబుల్లాలోనే కోహ్లి నేడు సారథిగా జట్టును ముందుండి నడిపించనున్నాడు. లంకతో పరిమిత ఓవర్ల సిరీస్ మామూలుగా కనిపిస్తున్నా భారత్‌కు మాత్రం అలాకాదు. 2019లో జరిగే ఐసీసీ ప్రపంచకప్‌నకు వ్యూహరచన ఈ సిరీస్ నుంచే ప్రారంభమైనట్టు కనిపిస్తోంది. మెగాటోర్నీకి భారత జట్టు తుదికూర్పు కోసం సెలక్టర్లు చేస్తున్న తొలి ప్రయోగమే ఈ సిరీస్. ఆదివారం జరిగే తొలి వన్డేలో రెండు జట్లు ఎలా ఉన్నాయంటే..

**పిచ్ లంకకే..**

దంబుల్లా పిచ్‌పై పరుగుల వరద కష్టం. ఇక్కడ టీమిండియా 17 వన్డేలాడి 9 గెలిచింది. అందులో ఒక ద్వైపాక్షిక, విండీస్, కివీస్‌తో ముక్కోణపు సిరీస్ ఆడింది. 2004, 2010 ఆసియాకప్‌లో ఆడింది. ఇక శ్రీలంకతో 11 వన్డేలాడగా గెలిచింది మాత్రం నాలుగే. ఆతిథ్య టెస్టు జట్టు పేలవంగా ఆడినా వన్డే జట్టు మాత్రం అలాకాదు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా నిర్దేశించిన 320పైగా లక్ష్యాన్ని లంకేయులు సునాయాసంగా ఛేదించిన సంగతి మరిచిపోవద్దు. పరిమిత ఓవర్లలో లంకేయులు ఎప్పుడూ ప్రమాదకారులే! అయితే జింబాబ్వేతో 2-3తో సిరీస్ కోల్పోయిందీ వారే.

## సెప్టెంబర్ 1 నుంచి ఈ-నామ్ అమలు చేయాలి

- ఈ-నామ్‌ద్వారా పారదర్శక కొనుగోళ్లు
- రైతులకు న్యాయం చేయడమే లక్ష్యం
- కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తుంది
- మార్కెటింగ్ కమిషనర్ శామ్యూల్ ఆనంద్

గుంటూరు: ఈ-నామ్ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి పక్కాగా అమలు చేయాలని మార్కెటింగ్ కమిషనర్ శామ్యూల్ ఆనంద్ సూచించారు. మార్కెటింగ్ శాఖ కమిషనరేట్‌లో ఆయన మార్కెటింగ్ జాయింట్ డైరెక్లర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, కార్యదర్శులతో సమావేశమయ్యారు. శామ్యూల్ ఆనంద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నేషనల్ అగ్రికల్చరల్ మార్కెట్ (ఈ-నామ్) పథకం కింద నిధులను సమకూరుస్తుందని తెలిపారు.

ఈ-నామ్ ద్వారా పక్కాగా కొనుగోళ్లు నిర్వహించి రైతులకు న్యాయం చేయాలనే కృతనిశ్చయంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని వివరించారు. ఒక్కో మార్కెట్ కమిటీకి రూ.30 లక్షల వంతున మంజూరు చేసి క్యాబిన్లు, మౌలిక వసతులు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు.

మొదట విడతగా గుంటూరు, దుగ్గిరాల, అనకాపల్లి, ఏలూరు, కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, కడప, హిందూపురం, కళ్యాణదుర్గం మార్కెట్ కమిటీల్లో ఈ-మార్కెటింగ్ కొనుగోళ్లు ఇప్పటికే ప్రారంభమయ్యాయని వెల్లడించారు. ఇందులో అనకాపల్లి, గుంటూరు, కళ్యాణదుర్గం మినహా మిగతా అన్ని యార్డుల్లో ఈ-మార్కెటింగ్ పూర్తి స్థాయిలో విజయవంతమైందన్నారు. పై మూడు యార్డుల్లో కూడా ఈ-మార్కెటింగ్ ద్వారానే జరుగుతున్నప్పటికీ కొన్ని లోటుపాట్లు ఉన్నాయని, వాటిని కూడా సరిదిద్ది పూర్తిస్థాయిలో ఈ-నామ్ ద్వారా కొనుగోళ్లు నిర్వహించేందుకు కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలన్నారు.

దీని ద్వారా పారదర్శకంగా లావాదేవీలు జరుగుతాయన్నారు. దళారుల ప్రమేయం చాలా వరకు తగ్గుతుందని వివరించారు. అదేవిధంగా పత్తి విస్తీర్ణం పెరిగినందున భారీ స్థాయిలో పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు.

కనీస గిట్టుబాటు ధర కంటే మార్కెట్లో ధరలు తక్కువగా ఉంటే సీసీఐ ద్వారా కొనుగోళ్లు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అందుకు అవసరమైన మౌలిక వసతులను మార్కెట్ యార్డుల్లో కల్పించాలని సూచించారు.

## ముగిసిన ఎల్‌ఐసీ జోనల్ క్రీడా పోటీలు

విజయవాడ : జాతీయ జీవిత బీమా సంస్థ మచిలీపట్నం డివిజన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నగరంలోని దండమూడి రాజగోపాలరావు నగరపాలక సంస్థ ఇండోర్ స్టేడియంలో జరిగిన దక్షిణ మధ్య మండలం బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్ ఫైనల్‌లో కె.కిషోర్ కుమార్ (హైదరాబాద్) 21-17, 21-19 తేడాతో ఎన్.నాగవినాయక్ (హైదరాబాద్)పై విజయం సాధించగా.. మహిళల సింగిల్ ఫైనల్‌లో కె.శ్రీదేవి (హైదరాబాద్) 21-13, 21-11తో కేఎల్‌జ్యోతి (మైసూరు)పై విజయం సాధించింది. టేబుల్ టెన్నిస్ పురుషుల ఫైనల్‌లో ఎస్ఎస్‌ఖనాడే (బెల్గాం) 6-11, 11-9, 11-7, 11-4, 11-9 తో ఏవీఎస్‌సింగరాజు (రాజమండ్రి)పై, మహిళల విభాగంలో సిమిన్ దస్తాని (హైదరాబాద్) 11-6, 11-4, 11-2, 11-5 తో యు.అనిత (ఉడిపి)పై విజయం సాధించింది. ముగింపు సభకు శాప్ ఓఎస్‌డీ పి.రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందించారు. ఒక్కో కేటగిరిలో తొలి ఎనిమిది స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు ఆలిండియా ఎల్‌ఐసీ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ పోటీలకు అర్హత సాధించారని దక్షిణ మధ్య మండలం ఆర్ఎం (హెచ్‌ఆర్‌డీ) కేవీపీవీనరసింహం ప్రకటించారు. మచిలీపట్నం డివిజన్ మార్కెటింగ్ మేనేజర్ డీఆర్‌కేఆర్‌శివరాం, పీ అండ్ ఐఆర్ మేనేజర్ ఎల్.తారకరామ్, మేనేజర్ (ఓఎస్) ఎస్.రామనాథబాబు, స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు సభ్యులు కిషోర్‌కుమార్, అంబేద్కర్‌లు పాల్గొన్నారు.

## విద్యార్థులూ.. దరఖాస్తు చేసుకోండి

- జ్ఞానభూమి ద్వారా దరఖాస్తు పొందాలి
- ఉపకార వేతనం, బోధన రుసుము అందజేయబడుతుంది
- దరఖాస్తు గడువు 30-08-2017
- సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రోశన్న

అనంతపురం: 2016-17 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం అందజేసే ఉపకార వేతనం, బోధన రుసుములను పొందేందుకు జ్ఞానభూమి ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రోశన్న ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 15-12-2016 తర్వాత సెట్‌కౌన్సిలింగ్ ద్వారా బీఎస్సీ నర్సింగ్, బీపీటీ, ఎంపీటీ, బీఎస్సీ, ఎంఎల్‌టీ, బీఎంఎస్, బీహెచ్‌ఎంఎస్, బీఎన్‌వైఎస్, బీయుఎంఎస్‌ఎండి, (ఆయుర్వేదిక్), ఎండీ హోమియో, బీఎస్సీ వ్యవసాయం, లా కళాశాలల్లో తదితర కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో జ్ఞానభూమి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. సెట్ సంబంధిత కోర్సుల విద్యార్థులకు మాత్రమే ఈ అవకాశం కల్పించారనీ.. వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తు గడువు 30-08-2017గా ప్రభుత్వం ప్రకటించిందని వెల్లడించారు. సదరు కళాశాల యాజమాన్యాలు ఈ విషయాన్ని గుర్తించి విద్యార్థులతో జ్ఞానభూమి పోర్టల్ ద్వారా గడువులోపు దరఖాస్తు చేయించాలని సూచించారు.

### వచ్చే ఎన్నికల్లోనూ చౌహనే సారథి

భోపాల్: వచ్చే ఏడాది మధ్యప్రదేశ్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రస్తుత సీఎం శివరాజ్ సింగ్ చౌహనే పార్టీ ముందుకెళుతుందని భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్ షా స్పష్టంచేశారు.






Editor : Bete Sai Trilok, Printed and Published by Bete Chandra Sekhar on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from D.No:58-3-15/1A, Atchamma Street, Patamata, Vijayawada-520 010, A.P. and Printed at **VIJAYABHANU PRESS,** D.No.9-3-17, Pithapuram Colony, Visakhapatnam -530 003, RNI No.APTEL/2008/24468, ☆ e-mail: vijayabhanudaily@gmail.com